



# విజయభాను






విశాఖపట్నం, శనివారం 25-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 72 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### యాదగిరీశుడిని దర్శించుకున్న

## కేసీఆర్, కుటుంబ సభ్యులు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారిని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో వచ్చిన ముఖ్యమంత్రి ముందుగా ఓ వివాహానికి హాజరయ్యారు.

తెరాస విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తుంగ బాలు వివాహ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

అనంతరం యాదగిరిగుట్ట చేరుకుని యాదగిరీశుడిని దర్శించుకున్నారు. ఆ తర్వాత ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పనుల్లో జాప్యం జరుగుతోందని వైటీడీఏ, ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వెంట మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

### ముఖ్యమంత్రి టీచరైన వేళ..

### ఏపీలో ఉత్తమ విద్యా విధానాల అమలుకు

# డిజిటలైజేషన్

- డిజిటలైజేషన్‌ను అనుసంధానిస్తాం
- విద్యార్థులకు స్వయంగా డిజిటల్ పాఠాలు
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- హాజరైన మంత్రి గంటా శ్రీనివాసరావు



అమరావతి: ప్రపంచంలోని ఉత్తమ విద్యా విధానాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్న ఆయన దాదాపు 5వేల పాఠశాలలను డిజిటలైజేషన్‌కు అనుసంధానిస్తామని తెలిపారు.

రాజధాని అమరావతి మందడంలోని జడ్పీ పాఠశాలలో డిజిటల్ తరగతిని చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. వర్చువల్ విధానంలో వివిధ రకాల పాఠాలను విద్యార్థులతో కలిసి కూర్చుని విన్నారు. సాధారణ గదికి, వర్చువల్ గదికి ఎలాంటి తేడాలు గమనించారంటూ విద్యార్థులను ప్రశ్నించారు.

విద్యార్థులకు స్వయంగా డిజిటల్ పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు గంటా శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాస్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధిపేటలో కూలిన శిక్షణ హెలికాప్టర్

### పైలట్లు ఇరువురూ క్షేమం

### వివరాలు తెలుసుకుంటున్న వైమానికి దళ అధికారులు

సిద్ధిపేట: సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ శివారులోని నాగులబండ వద్ద వైమానికదళ శిక్షణ హెలికాప్టర్ కుప్పకూలింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు మహిళా పైలట్లు సురక్షితంగా బయట పడ్డారు. హెలికాప్టర్‌లో సాంకేతిక లోపాన్ని గమనించిన పైలట్ కిందకు దించేందుకు ప్రయత్నించగా... మంటలు చెలరేగి గాల్లోనే పేలిపోయింది. ఇద్దరు పైలట్లు పారాచూట్ సాయంతో కిందకు దిగారు. గాయపడిన పైలట్‌ను సిద్ధిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హకీంపేట తరువాయి 2లో

## సాంబశివరావుకు పూర్తిస్థాయి బాధ్యతలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్తిస్థాయి డీజీపీగా నండూరి సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జూలై నుంచి సాంబశివరావు ఇన్‌చార్జి డీజీపీగా కొనసాగుతున్నారు. డిసెంబర్ 31న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను పూర్తిస్థాయి డీజీపీగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 31 తర్వాత ఆయన పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన పదవీ కాలాన్ని తరువాయి 2లో


### కాళేశ్వరం రెండోదశకు

## అనుమతులు మంజూరు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు రెండో దశ అటవీ అనుమతులు లభించాయి. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక సమాచారం అందింది. ప్రాజెక్టు పనుల్లో భాగంగా కాల్వలు, సొరంగాలు, ఎత్తిపోతలు, జలాశయాల నిర్మాణం కోసం 3168.131 హెక్టార్ల అటవీ భూమి వినియోగం కోసం అనుమతులు మంజూరు తరువాయి 2లో


## డిసెంబర్ 21న ఆర్కేనగర్ ఉపఎన్నిక



చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని ఆర్కేనగర్ నియోజకవర్గ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. డిసెంబర్ 21న పోలింగ్, 24న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతితో ఆర్కేనగర్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. గతంలో ఉపఎన్నికకు సిద్ధమైన ఈసీ నిబంధనల ఉల్లంఘన జరగడంతో తరువాయి 2లో

## రెండు పరుగులకే ఆలౌట్..



### క్రికెట్లో సంచలనం!

నాగాలాండ్ మహిళల అండర్-19 క్రికెట్ జట్టు కేవలం రెండు పరుగులకే ఆలౌట్ అయ్యింది.

-- వార్త 8వ పేజీలో..

### విజయవంతంగా

## సునామి మాక్‌డ్రిల్



విశాఖపట్నం: విపత్తులు సంభవించినపుడు వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలో ప్రజలకు తెలియజేసే విధంగా దేశ వ్యాప్తంగా తూర్పు కోస్తా రాష్ట్రాలలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మరియు మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా సునామి మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు ఈ కార్యక్రమాన్ని విశాఖ పట్టణ పరిధిలో పెదజాలరిపేట, భీమిలి తరువాయి 2లో

### టేకిట్ ఈజీ



పిల్లల్ని డిజిటల్ స్కూల్‌కు తీసుకువెళ్లేందుకు రెడీ అవుతున్నారొదినా..!!

### వెల్దుర్తి నుంచి

## 17వ రోజు ప్రజాసంకల్పయాత్ర



వెల్దుర్తి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర 17వ రోజు షెడ్యూల్ ఖరారు అయింది. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి నుంచి ఆయన శనివారం ఉదయం పాదయాత్రను ప్రారంభించనున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వెల్దుర్తి, చెరుకులపాడు, పుట్లూరు క్రాస్, తొగరచేడు క్రాస్ వద్దకు చేరుకుంటారు. ఈ యాత్రలో వైఎస్ జగన్ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, వారికి భరోసా కల్పిస్తూ ముందుకు సాగనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కృష్ణగిరి నుంచి పాదయాత్ర పున:ప్రారంభం అవుతుంది. అలాగే సాయంత్రం 6.30గంటలకు రామకృష్ణ పురం చేరుకుంటారు. అనంతరం రాత్రి 7.30 గంటలకు వైఎస్ జగన్ బస చేస్తారు. ఈమేరకు 17రోజు పర్యటన వివరాలను వైఎస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం ప్రకటించారు.




# సి.ఎం. సహాయనిధి చెక్కును అందజేసిన
## శాసనమండలి ఉపాధ్యక్షులు "ఆర్.ఎస్."



ఆలమూరు : ఆలమూరు మండలంలోని చొప్పెల్ల శివారు శ్రీరామనగర్ కాలనీకి చెందిన చల్లా చక్రయ్య గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇతనికి వైద్య ఖర్చులు నిమిత్తం సి.ఎం. సహాయనిధి నుండి మంజూరు అయిన రూ. 25,000/- లు చెక్కును శుక్రవారం శాసనమండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం చేతులమీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలోని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఈదల సత్యనారాయణ చౌదరి (నల్లబాబు), బండారు సత్తిబాబు, మండల టిడిపి కార్యదర్శి రాయుడు సూరిబాబులు పాల్గొన్నారు.

# గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణా కార్యక్రమం



ఆలమూరు : మండల పరిధి పినపళ్లలో వ్యవసాయాధికారులు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా చివరిదశ శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.వి.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఎకరానికి 50 నుండి 100 కేజీలు దమ్ములో సింగల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలని, తద్వారా క్రితం పంట అవశేషాలు భూమిలో చివికి పోతాయని, అదేవిధంగా పొటాష్ 20 కేజీలు దమ్ములోను, మరియు 3వకోటాలో యూరియా లో కలిపి 20కేజీలు వేయటం వలన మొక్కకు సమర్ధవంతంగా ఉపయోగపడుతుందని ఆయన తెలియజేసారు. దాళ్వాలో జింక్ లోపం ఎక్కువగా వుంటుంది కావున దమ్ములో ఎకరానికి 20 కేజీలు ముడిజింక్ వేసుకోవాలని, అలాగే చల్లిక చల్లిన 22 రోజులకు జింక్ సల్ఫేట్ ఒకసారి, మరలా 35 రోజులకు ఒకసారి పిచికారీ చేసిన యెడల జింక్ లోపం నుండి పంటను కాపాడుకోవచ్చునని ఆయన తెలియజేసారు. రైతులు ప్రస్తుతం కుప్ప నూర్పిడి పనులలో వుండటం వలన వారికి ధాన్యం దాయటానికి తగిన సూచనలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయాధి కారి కె.వి.ఎన్.రమేష్ కుమార్, ఎంపిఈఓలు శ్రీలక్ష్మి, మనోహర్‌లు, రైతులు జంగం రామా రావు, పెద్దిరెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దీక్షలు విరమించండి
## మీ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తాం




విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నిరాహార దీక్షలు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు తక్షణం తమ దీక్షలను విరమించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన దీక్ష శిబిరాన్ని సందర్శించి కాంట్రాక్ట్ అధ్యాపకులతో మాట్లాడారు. నాలుగు రోజులుగా చేస్తున్న దీక్షలను విరమించాలని సూచించారు. దీక్షలు విరమించి విధులకు హాజరై బోధనపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు ఇచ్చిన వినతి పత్రాన్ని ఆయన స్వీకరించారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను, విజ్ఞాపనను వర్సిటీ తరపున ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు.

# అవినీతిపై సంఘటిత ఉద్యమానికి ప్రజలు సిద్ధంకావాలి:చేతన




పిఠాపురం : దేశంలో పెరిగిపోతున్న అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేందుకు సమాచార హక్కు చట్టంతో ప్రజలు ముందడుగు వేయాలని ఫోరం ఫర్ ఆర్‌టిఐ జాతీయ కన్వీనర్ చేతన పిలుపునిచ్చారు. పిఠాపురం సూర్యరాయ గ్రంధాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో శుక్రవారం జరిగినీర్‌టిఐ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు,యువత సద్వినియోగం చేసుకొని రాజ్యాంగాన్ని అమలు చేయించు కొనేందుకు ప్రజలు ముందడుగు వేయాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భయ్యా రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈచట్టం అమలులోనికి వచ్చాక దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను వచ్చాయని వాటిని ఉదహరించారు. న్యాయవాధ విభాగ జిల్లా అధ్యక్షురాలు జంగం సంతోషకుమారి మట్లాడుతూ పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచినప్పుడు ప్రజాస్వా మ్యం మనగలుగుతుందన్నారు.

ఈసభలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బి.భోగేశ్వరి,వారధి బ్లడ్ డోనర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కె.లలితాదేవి, ఫోరంఫర్ ఆర్‌టిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆచంట వరలక్ష్మి, డి.నారామణమూర్తి, మొండి రవి తదితరులు మాట్లాడారు

# 98 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాల ప్రకటనపై కృతజ్ఞతలు
### జిల్లా అధ్యక్షులు రామదేవుడు

రావులపాలెం: రావులపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామదేవుడు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, గోవిందు, రామరాజు, ఇతర క్వాలిఫైడ్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 1998 డిఎస్‌సి అర్హత సాధించిన అభ్యర్థులకు ఉద్యోగాలిస్తున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు, ఐటి శాఖామాత్యులు నారా లోకేష్, 98 డిఎస్‌సి అభ్యర్థుల తరపున నిలబడిన రాష్ట్ర మంత్రులకు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు 98 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు అందరూ ముక్త కంఠంతో కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భముగా అతి త్వరలో తమకు ఉద్యోగాలిస్తూ జిఓ విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో 98 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# నేడు ఆదిత్యకు మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్ కందారాక

గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య ఇజనీరింగ్ కళాశాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ మోహన్ కందా విచ్చేయనున్నట్లు ఆదిత్యవిద్యా సంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు.ఆదిత్యలో బిటెక్, ఎంటెక్, ఎంబిఎ చదువుతున్న విద్యార్థులు ఐఎఎస్ చదవాలనుకొనే ఆశక్తి గల విద్యార్థులతో ముఖాముఖి ఉంటుందన్నారు. వారికి తగు సూచనలు,సలహాలు ఇస్తారని సతీష్‌రెడ్డి తెలిపారు. వీరివెంట కలెక్టర్ కార్తికేయ మిశ్రా కూడా హాజరవుతారన్నారు. యువ ఇంజనీర్లు ,ఐఎఎస్ కావాలను కొనేవారు ఈ అవకాసం సద్వానియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఇం.నీరింగ్ క్యాంపస్ డైరెక్టర్ డా.ఎం.క్షనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డా.టికె.రామకృష్ణారావు, ప్రొఫెసర్ ఆదిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# త్రివిధ సేవాతత్పరుడు గ్రంధం

కాకినాడ : స్వర్గీయ గ్రంధం చంద్రరావు త్రివిధ సేవా తత్పరులని , ఆయన తన ఉపాధ్యాయ వృత్తికి, కులానికే కాక తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు చేసిన మహామనీషి అని రజక ఐక్యవేదిక కొనియాడింది. అటువంటి చంద్రరావు సేవలను సర్మించి ఘనమైన నివాళులు అర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనెల 26 (ఆదివారం) ఎదయం 9గంటలకు స్థానిక ఆర్ అండ్‌బి అతిధి గృహలో సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు రజక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

# ఈతకోటలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



రావులపాలెం: మండల పరిధి ఈతకోటలో వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద గ్రామస్థులు, ధాతల సహకారంతో ఆంజనేయ, నవగ్రహ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వేదమంత్రోచ్ఛారణల నడుమ వేదపండితులు, అర్చకస్వాములు అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాగిడిమిల్లి రాంబాబు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ తగు ఏర్పాట్లు జరిపారు.

# గడువులోగా సరుకులు అర్హులకు అందించాలి
### తహశీల్దారు వరదా సుబ్బారావు

ఆత్రేయపురం : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రేషను డీలర్ల సమావేశం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ సమావేశంలో తహశీల్దారు వరదా సుబ్బారావు మాట్లాడుతూ కొత్త రేషను కార్డులు మంజూరు, వాటిని ఏఏ రేషను డీలర్లు ఏవిధంగా సరఫరా చేయాలనే అంశంపై తగు సూచనలు చేసారు. రేషనును సక్రమంగా అర్హులందరికీ అందేలా డీలర్లు పనిచేయాలని, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా షాపులను నిర్వహించాలని ఆయన అన్నారు. డీలర్లుపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భముగా డీలర్లు మాట్లాడుతూ అర్హులందరికీ తగిన సమయంలో సరుకులు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

# అంగరంగ వైభవంగా
## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణోత్సవం

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం గ్రామంలో వేంచేసిన శ్రీశ్రీశ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవం సందర్భంగా ఉదయం నుండి స్వామివారిని భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో దర్శించుకొన్నారు.స్వామివారి దివ్య కళ్యాణం రాత్రి 8 గంటలకు గుడికి ఎదురుగా ఉన్న హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి,అమ్మవార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా, కనులు మిరుమిట్లు గొలిపే విధంగా జరిగింది.కళ్యాణంను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొని స్వామి,అమ్మవార్ల కరుణాకటాక్షములకు పాత్రులైనాను.అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

# జగన్మాత దుర్గమ్మకు విరాళాలు

ఇంద్రకీలాద్రి : ఇంద్ర కీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు పశ్చి మగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన సూర్యనారాయణ, శైలజ దంపతులు 1.203 కిలోల బరువున్న వెండి ఆదిశేషు పడగను భవానీ పురం వాసి ఎం.నర్సింహారావు కుటుంబ సభ్యులు నిత్యాన్న దాన పథకానికి రూ.1,01,116 లు విరాళం ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయి

# డిసెంబర్ 21న ఆర్కేనగర్ ఉపఎన్నిక

షెడ్యూల్‌ను రద్దు చేసింది. ఇటీవల ఈ అంశంపై విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు డిసెంబర్ 31లోగా ఆర్కేనగర్ ఉపఎన్నిక నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో ఈసీ శుక్రవారం తాజా షెడ్యూల్‌ను విడుదల చేసింది.

# సిద్ధిపేటలో కూలిన శిక్షణ హెలికాప్టర్

నుంచి వస్తున్న శిక్షణ హెలికాప్టర్ గాలిలోనే పేలిపోవడంతో సుమారు ఎకరా విస్తీర్ణంలో హెలికాప్టర్ శకలాలు చెల్లాచెదురుగా పడ్డాయని స్థానికులు తెలిపారు. వైమానికదళ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# కాళేశ్వరం రెండోదశకు అనుమతులు మంజూరు

అయ్యాయి. ఎనిమిది డివిజన్లలోని అటవీ భూములను వినియోగించుకునేందుకు గత నెల 24న కొన్ని షరతులతో కూడిన మొదటి దశ అనుమతులు లభించాయి. రూ.722కోట్లను అటవీ పరిహారంగా జమ చేయడంతో పాటు ఇతర షరతులను పూర్తి చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ అటవీ అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు దిల్లీ వెళ్లి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు ఇతర అధికార యంత్రాగాన్ని కలిసి అనుమతులు కోసం విజ్ఞప్తి చేశారు. నిన్న జరిగిన కమిటీ సమావేశంలో రెండో దశ అనుమతులు ఇచ్చారు. అందుకనుగుణంగా శుక్రవారం అధికారికంగా ఆదేశాలు వెలువడ్డాయి.

# విజయవంతంగా సునామి మాక్‌డ్రిల్



పరిధిలో చుక్కవానిపాలెంలో సునామి మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్, కోస్ట్ గార్డ్స్ నేవి, ఎయిర్ ఫోర్స్, పోలీసు, ఫైర్ హెూం గార్డ్, మెడికల్, జివిఎంసి, ట్రాన్స్‌పోర్టు, ఇరిగేషన్, ఫిషరీస్, సివిల్ డిఫెన్స్, రెడ్ క్రాస్, వాలంటీర్స్ సంబంధిత వాహనాలతో అప్రమత్తంగా ఉండి సునామి హెచ్చరికలు



బులెటిన్‌ను అనుసరించి అధికారుల ఆదేశాలతో పెదజాలరి పేటకుతరలి వెళ్లారు. నికోబార్ దీవులలో భూకంపం వచ్చిన నేపథ్యంలో సునామి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున సంబంధిత తూర్పు కోస్తా తీర ప్రాంతం రాష్ట్రాలకు నష్టం సంభవించే అవకాశం వున్నందున అక్కడ ప్రజలను అప్రమత్తం చేస్తూ వారిని రక్షించి తుపాన్ పునరావాస కేంద్రాలకు తరలించడం, సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించి పడవల ద్వారా ఒడ్డుకు తీసుకురావడం, హెలికాప్టర్లద్వారా ఆహార పదార్థాలను అందించడం, ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స అందించడం , 108 వాహనాల ద్వారా అసుపత్రులకు తరలించడం తదితర అంశాలతో పాటు బాధితులకు కావలసిన ఆహారం, నీటి సౌకర్యాన్ని కల్పించడం తదితర అంశాలపై మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు.

మార్సల్ ఐలాండ్స్, పాలన్, సలోమన్, సమోనా, నౌరు, సొలాహి, వనాటు, కిరిబటి, ఫిజి తదితర దీవులైన 11 దేశాలు నుండి వచ్చిన విదేశీ ప్రతినిధులు ఇక్కడ జిల్లా యంత్రాంగం చేపడుతున్న సునామి ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ జాయింట్ అడ్వైజర్ దీరేంద్ర సింగ్ సిద్ధు వారికి మాక్ డ్రిల్ చేస్తున్న ఏర్పాట్లపై వివరించారు.

సునామి మాక్ డ్రిల్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ డిఫెన్స్ ఎస్‌డిసి జవహర్ లాల్ నెహ్రూ, రెవెన్యూ సిబ్బంది పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాంబశివరావుకు పూర్తిస్థాయి బాధ్యతలు

పొడిగించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కొత్త డీజీపీని ఎంపిక చేసేందుకు అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తోసుపుచ్చింది. ఏడుగురు అధికారుల పేర్లతో రాష్ట్రం పంపిన జాబితాను వెనక్కి పంపింది. అంతేకాకుండా ఆరునెలల లోపు రిటైర్డ్ అయ్యే వారిని పేర్లను తొలగించి తదుపరి జాబితా పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భిన్నాభిప్రాయాలు రావడంతో ఢిల్లీలో బుధవారం జరగాల్సిన యూపీఎస్సీ కమిటీ సమావేశం వాయిదా పడింది. సాంబశివరావు పదవీ విరమణ చేస్తే డీజీపీ రేసులో ఠాకూర్, కౌముదిలు ఉంటారు. అయితే కౌముది ఏపీ డీజీపీగా వచ్చేందుకు ఆసక్తి చూపించడంలేదని తెలుస్తోంది. సాంబశివరావు పొడిగింపు లేకుంటే ఠాకూర్ డీజీపీ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఆస్కార్ పిస్టోరియస్ జైలుశిక్ష పెంపు

జోహెన్స్‌బర్గ్: ప్రేయసిని హత్య చేసిన కేసులో దక్షిణాఫ్రికా మాజీ పారాలింపియన్ ఆస్కార్ పిస్టోరియస్ జైలు శిక్ష పొడిగించారు. ఈ కేసులో ఇప్పటికే అతడికి ఆరేళ్ల జైలు శిక్ష విధించగా.. ఇప్పుడు దానిని 13ఏళ్ల ఐదు నెలలకు పొడిగిస్తూ దక్షిణాఫ్రికా సుప్రీంకోర్టు ఆఫ్ అప్పీల్స్ శుక్రవారం తీర్పు వెలువరిచింది.

2013లో ప్రేమికుల దినోత్సవం రోజున ఆస్కార్ తన ప్రేయసి రీవా స్టీన్‌క్యాంప్‌ను కాల్చి చంపిన విషయం తెలిసిందే. ప్రెటోరియాలోని అతడి నివాసంలోనే ఈ హత్య జరిగింది. దీంతో అతడిని అరెస్టు చేశారు. అయితే రీవాను దుండగుడు అనుకుని పొరపాటుగా కాల్చి చంపినట్లు విచారణ సమయంలో అతడు అధికారులకు తెలిపాడు. ఈ కేసులో అతడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ 2014లో స్థానిక హైకోర్టు తీర్పు చెప్పింది. అయితే 10 నెలల జైలు శిక్ష తర్వాత అతడు బెయిల్‌పై విడుదలయ్యాడు.

మరోవైపు రీవాది కుట్రపూరిత హత్యే అని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన న్యాయస్థానం 2016లో ఆస్కార్‌కు ఆరేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ అక్కడి ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. దీంతో అతి సున్నితమైన ఘటనగా భావించిన న్యాయస్థానం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ కేసులో అతడికి 15ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే ఇందులో ఇప్పటికే 19నెలల శిక్ష పూర్తవడంతో మరో 13 ఏళ్ల ఐదు నెలలు ఆస్కార్ జైల్లోనే ఉండాలని స్పష్టం చేసింది.

# లాభాలతో ముగిసిన మార్కెట్లు



ముంబై : మిడ్ సెషన్‌లో ఊపందుకున్న కొనుగోళ్లతో మరోసారి సాంకేతికంగా కీలక స్థాయి లను అధిగమించిన స్టాక్ మార్కెట్లు, చివరికి మంచి లాభాలతోనే ముగిశాయి. సెన్సెక్స్ 91 పాయింట్ల లాభంలో 33,679 వద్ద, నిఫ్టీ 41 పాయింట్ల లాభంలో 10,389 వద్ద క్లోజయ్యాయి. మిడ్ సెషన్‌లో కొనుగోళ్ల జోరుతో సెన్సెక్స్ 33,700ను దాటగా.. నిఫ్టీ 10,400 ను అందుకుంది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, బజాజ్ ఆటో, గెయిల్, అర బిందో ఫార్మాలు టాప్ గెయిన ర్లుగా నిలువగా.. బీహెచ్ఈఎల్, ఎస్‌బీఐ, హిందాల్కో, వేదంతాలు టాప్ లూజర్లుగా నష్టాలు గడించాయి. అటు డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు బలహీనపడి 64.71 గా నమోదైంది. బంగారం ధరలు 28 రూపాయల లాభంలో రూపాయలుగా ఉన్నాయి.

## రెండు బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్ మరియు

# విజయవంతమైన ఆర్థిక ఫలితాలతో దూసుకుపోతున్న డబ్ల్యుఎన్ఎస్



విశాఖపట్నం: అంతర్జాతీయ బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) కంపెనీ డబ్ల్యుఎన్ఎస్ లిమిటెడ్ మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా రెండు బిలియన్ డాలర్ల మార్కును దాటింది. గత కొద్ది సంవత్సరాలుగా కంపెనీ వెల్లడిస్తున్న ఘనమైన ఆర్థిక ఫలితాలు ఈ బుల్లిష్ సెంటిమెంట్‌ను అంచనా వేశాయి. కేశవ్ ఆర్ మురుగేష్, డబ్ల్యుఎన్ఎస్-గ్రూప్ సీఈవో మాట్లాడుతూ 'గత దశాబ్దకాలంలో బీపీఎం రంగు భారీ వృద్ధిని నమోదు చేసింది. కేవలం వ్యయ తగ్గింపు అందించడం దగ్గర నుంచి, ఇప్పుడు మేం కన్సల్టెంట్ ఆధారిత ఎంగేజ్‌మెంట్స్‌ను ఖాతాదారులకు ఆటోమేషన్, ఎనలిటిక్స్‌పై ఆధారపడి అందించడంతో పాటుగా వినియోగదారుల అనుభవాలు, వ్యాపార ఫలితాలను వృద్ధి చేసేందుకు ప్రయ త్నిస్తున్నాం. ఆర్డర్లను తీసుకోవడం దగ్గర నుంచి ప్రాధాన్యతా భాగస్వామిగా ఎంపిక కావడం వరకూ పరిశ్రమ డీఎన్ఏను మారుస్తున్నాం' అని అన్నారు. 2010 సంవత్సరంలో డబ్ల్యుఎన్ఎస్ పగ్గాలను కేశవ్ చేపట్టినప్పుడు మార్కెట్ క్యాపి టలైజేషన్ 500 మిలియన్ డాలర్లు మాత్రమే ఉండేది. ఈ కాలంలో, ఔట్ సోర్సింగ్ పరిశ్రమ సంప్రదాయ వేతన మధ్యవర్తిత్వంన ఉంచి డొమైన్- ఇంటె న్సివ్, ఎనలిటికల్ ఆధారిత నమూ నాల్లోకి మారింది. ఈ మార్పులను ఒడిసి పట్టుకునేందుకు కేశవ్, నూతన వ్యాపార విభాగంలో వర్టికలైజేషన్ నమూనా పరిచయం చేసి విజయం సాధించారు. ఈ నమూనా పరిశ్రమకు ప్రత్యేకమైన వృద్ధిని ట్రావెల్, బీమా, ఆరోగ్య సంరక్షణ, యుటిలిటీ విభాగాలపై దృష్టి సారించి పొందింది. కంపెనీ లాభాలు అప్పటినుంచి రెట్టింపు కన్నా అధికం కావడంతో పాటుగా మార్కెట్ క్యాపి టలైజేషన్ నాలుగు రెట్లు వృద్ధి చెందింది. నేడు మీ ముందు మాట్లాడు తుండటం పట్ల ఆనందం గానూ, గర్వం గానూ ఉంది. నా గౌరవ ప్రదమైన ప్రయాణాన్ని వైజాగ్‌లోనే ప్రారంభించాను. రాష్ట్రంలోని పలు శాఖలు మరియు కేంద్ర ప్రభుత్వం, ఎస్‌టీపీఐ, నాస్కామ్ మరియు ఐటీఏఏపీ నుంచి అద్భుతమైన సహ కారం డబ్ల్యుఎన్ఎస్‌కు లభించింది. వారి సహకారంతో మేం వైజాగ్‌లో వృద్ధి చెందామని కేశవ్ ఆర్ మురుగేష్ అన్నారు.

## సింహాచలేశుని దర్శించుకున్న ప్రభుత్వవిప్



సింహాచలం : సింహాద్రిపై కొలువై ఉన్న వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని ప్రభుత్వవిప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు దంపతులు, విప్ కుమార్తె శ్రీజ దంపతులు తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఆర్వివిఎస్ ప్రసాద్ పూలమాల వేసి ఆహ్వానం పలికారు. అర్చక స్వాములు పూర్ణ కుంభంతో స్వాగతం పలి కారు. అనంతరం వీరు కప్పస్థంబం ఆలిం గనం చేసుకుని వేద నాదాల మధ్య బేడా ప్రదక్షణ చేశారు. స్వామివారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనం తరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ పర్యవేక్షకులు రమణ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు విప్ గా ప్రకింటించినంరోజు నా కుమార్తె శ్రీజ వివాహానికి ఆహ్వానం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు శుభలేఖ ఇచ్చిన రోజు, అదేవిధంగా నా కుమార్తె వివాహంరోజు మాకు విప్ గా ప్రభుత్వం నుండి ఆదేశాలు రావటం ఆ వరాహ లక్ష్మీనృసింహ దివ్య ఆశీస్సులే కారణం అన్నారు.

## వృధాగా మట్టిపాలౌతున్న అప్పన్న సొమ్ము







సింహాచలం : రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలవలన సింహాద్రినాధుని సొమ్ము హారతి కర్పూరంలా హరించుకుపోతుంది. కాంట్రాక్టర్ కు కాసులపంట పండుతుంది. 2010లో కొండపైన హిల్ టాప్ రోడ్ మార్గంలో గిరిజనుల కాలని పేరుతో 15 భవనాల 6రేకుల భవనాలు నిర్మించారు. అప్పట్లో ఒక్కో భవనం ఖర్చు రూ.1.30లక్షలు. అయితే అప్పటి దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ జే ఎస్ వి ప్రసాద్ ఈ గదులను దూర్రపాంతాల నుండి వచ్చిన భక్తులకు అద్దెకు ఇవ్వమని దేవస్థానం అధికారులకు ఆదేశాలు జారిచేశారు. అందుచేత అధికారులు మరిన్ని హంగులతో 2011 - 2012 మధ్య ఒక్కో భవనం పై అదనంగా రూ.1.10లక్షలు ఖర్చు పెట్టి సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ప్రస్తుతం వీటి ఖరీదు ఒక్కొకటి రూ.3.20లక్షలు, 6రేకుల భవనాల ఖరీదు రూ.10లక్షలు ఖర్చుతో వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం వారు మార్పులు చేర్పులు చేసారు. ఈ భవనాలు ఎవరికీ ఉపయోగపడలేదు. దూర ప్రాంతాల భక్తులు రాత్రి వేళల్లో బస చేయాలంటే చుట్టూ అటవీ ప్రాంతమాయే. ఎవరి భయం వారికి ఉంటుంది మరి. ప్రస్తుతం ఈ అధునాతన గదులుల్లో మద్యం సేవించటం , అసాంగిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం . తాళాలు బద్దలు కొట్టి కొన్ని గదుల్లో వున్న పంకాలు, విధ్యుత్ దీపాలు, స్విచ్ బోర్డ్ లు, కొళాయిలు కు సంబందించిన పైపులు కొందరు దుండగులు ఎత్తుకెళ్లగా, అప్పట్లో కొన్నింటిని అధికారులు వాటిని తొలగించి భద్రపరిచారు. అయితే మరో కోణంలో ఆలోచిస్తే ప్రస్తుతం రోజులు అసలే బాగులేదాయే ఏ సంఘ విద్రోహశక్తి రెక్కి నిర్వహించరనే భరోసా ఏంటి అని భక్తులు అంటున్నారు. ఈ విషయం పై ఆలయ కార్యనిర్వాహణాధికారి కోడూరి అచ్చుత రామచంద్రమోహన్ ను వివరణ కోరగా ప్రస్తుత విభజన ప్రక్రియలో ఆగదులపై సరైన నిర్ణయం తీసుకోలే పోతున్నాం అని త్వరలోనే వాటిపై ఓ నివేదిక తయారు చేసి దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కు నివేదిక పంపుతామని అదేవిదంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ ను ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించమని ఆదేశాలు జారిచేస్తాం అని సమాదానం ఇచ్చారు.

## కార్మికవర్గ ఐక్యతకు సిఐటియును బలోపేతం చేయండి



గాజువాక: కార్మిక వర్గ ఐక్యతకు సిఐటియును బలోపేతం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి పి.కె.దాస్ స్టీల్ సిఐటియు కార్మికులకు పిలపు నిచ్చారు. శుక్రవారం ఉక్కు కార్మాగారం ఎల్.యం.యం. పార్క్‌వద్ద స్టీల్ సిఐయుటి విష్కృత కార్యకర్తల సమావేశం జరిగింది. స్టీల్ సిఐటియు అధ్యక్షులు జె. అయోద్యారాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా ఎస్‌డబ్ల్యూఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి పి.కె.దాస్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిరక్షణకు, దేశ ఆర్థికవ్యవస్థ పరిరక్షణకై మరో స్వాతంత్ర్య పోరాటానికి కార్మికవర్గం ఐక్యంగా ఉద్య మించవలసిన అవసరం ఆసన్నమైందని అన్నారు. దేశంలో స్పెషల్ స్టీల్ తయారు చేసే విశాఖ ఉక్కు కార్మాగారాన్ని అమ్మాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా బిలాయ్ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఉద్యమం అనంతరం ఆగష్టు 9న ఢిల్లీలో జరిగిన ఉద్యమాల ఫలితంగానే నేటికీ అవి ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతున్నాయని తెలిపారు. సిఐటియు ని బలపర్చడంద్వారానే ఐక్య ఉద్యమాలు సాధ్యమవుతాయని, తద్వారా ప్రభుత్వ విధానాలపై పోరాడగలమని పిలుపు నిచ్చారు. అఖిలభారత సిఐటియు నాయకులు యన్. రామారావు మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం, ఇంటక్ కలిసి కార్మిక ప్రయో జనాలను దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి వై.టి.దాస్, యూనియన్ నాయకులు బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, ఓ.వి.రావు, కె.సత్యన్నా రాయణ, పి. శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వరరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



37వవార్డ్ పరిధిలో గల మహాత్మ గాంధీ నగర్ జంక్షన్ లో వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంకల అప్పారావు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమ జరిగినది. ఈ కార్యక్రమంలో ముందూ స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంతఇల్లు ఉండాలని ఇంకా ప్రతి ఇంటిలో ఒక ఉద్యోగం ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసారు. అనంతరం గ్రామం లో ప్రతి ఇంటికి వెళ్లి వారివారి సమస్యలను అడిగితెలుసుకొని సీఎం డాష్ బోర్డు కి అప్ ద్వారా తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో అవలనారాయణ స్వామి, సిరసపిల్లి సత్య నారాయణ రాజు, రొంగలి మహేశ్వరావు, గురు ఈశ్వరరావు, ఈతలపక చంటి, గోలమాల అప్పారావు, గుమ్మిడి కుమారస్వామి,మోర్త రాజారావు ,శకుంతల వడిసెల చిన్నములు తదితరులు పాల్గొన్నారు.

# జీవ ఇంధనాల తయారీలో నూతన విధానాలు

**- ఆహార కొరత లేకుండా ఉత్పత్తి విధానాల రూపకల్పన - రిలయన్స్ ఇండస్ట్రీల్ లిమిటెడ్ శాస్త్రవేత్త డాక్టర్ జి.వెంకట సుభాష్**


వెంకట సుభాష్‌ను సత్కరిస్తున్న కన్వీనర్ శ్రీరామ్‌రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ : జీవ ఇంధనాల తయారీలో నూతన విధానాలు అవలంభించడం జరుగుతోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ శాస్త్రవేత్త డాక్టర్ జి.వెంకట సుభాష్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఇన్విరాన్‌మెంటల్ బయోటెక్నాలజీ అంతర్జాతీయ సదస్సులో ఆయన 'మైక్రోబయల్ బయోఫ్యూయల్స్ ప్రెజెంట్ అండ్ ఫ్యూచర్ ఎనర్జీ సోర్సెస్' అంశంపై ప్రసంగించారు. జీవ ఇంధనాల తయారీలో నేడు మూడోదశ జరుగుతోందన్నారు. మొదటి దశలో ఆహారపదార్ధాలు, షుగర్, స్టార్చ్‌ను విరివిగా ఉపయోగిచేవారన్నారు. రెండో దశలో లిగ్నో సెల్యుటోజ్‌ను వినియోగించడం జరిగిందన్నారు. నేడు మూడో దశలో బాక్టీరియా, ఆల్గే, ఫంగస్‌ను ఉపయోగించి జీవ ఇంధనాలను తయారు చేయడం జరుగుతోందన్నారు. ఆల్గేను ప్రత్యేకంగా పెంచి వాటి నుంచి జీవ ఇంధనాలను తయారు చేసే విధానాలను, బయో డీ గ్రేడబుల్ ప్లాస్టిక్, మైక్రోబయల్ బయో ఎనర్జీపై అవగాహన కల్పించారు. ఆల్గే వాతావరణంలోని కార్బన్‌డయాక్సైడ్‌ను తీసుకుని పెరుగుతుందని, తద్వారా కర్బన శాతం తగ్గుతుందన్నారు. దీనిని వృద్ధిచేయడంలో భౌతిక, రసాయనిక ప్రక్రియలు ఇమిడి ఉన్నాయన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య డి.శ్రీరామి రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతికత విస్తరిస్తోందన్నారు. ఇదే తరుణంలో పర్యావరణ సమస్యలు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. వీటిని సమన్వయం జరుపుతూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న రంగాల నిపుణులు నూతన సాంకేతిక విధానాలపై జరుపుతున్న పరిశోధనలు యువ పరిశోధకులకు, విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.ఎం యుగంధర్ మాట్లాడుతూ మూడు రోజుల సదస్సులో భాగంగా ఎన్విరాన్‌మెంటల్ బయోటెక్నాలజీ, బయోఫ్యూయల్స్-ఆల్టర్నేటివ్ ఎనర్జీ సోర్సెస్, నేచరల్ రిసోర్సెస్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్, సోలిడ్ అండ్ హజార్డస్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయో ఫార్మసూటికల్స్, ఇ వేస్ట్, మైనింగ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయో ఫెర్టిలైజర్స్, బయో పెస్టిసైడ్స్ బయో పాలిమర్స్, బయో డైవర్సిటి కంజర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ అండ్ ఫారెస్ట్రీ, కమర్షియల్ ఎంజైమ్స్, బయోకెమికల్ అండ్ ఫెర్మంటేషన్ ప్రాడక్ట్స్‌పై చర్చలు, ప్రసంగాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యాక్రమంలో కోశాధికారి డాక్టర్ సి.హెచ్ ఆశా ఇమ్మానియల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఉదయం ఆచార్య వి.రామ చంద్రమూర్తి డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ బయోలాజికల్ వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్రోసస్‌పై ప్రసంగించారు.

### అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

యలమంచిలి రూరల్ : అక్రమంగా సరుకులు రవాణా చేస్తే చర్యలు తప్పవని యలమంచిలి ట్రాఫిక్ ఎస్సై మునాఫ్ హెచ్చరించారు. జాతీయ రహదారిపై రేగు పాలెం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు సరిగా లేకుండా నిత్యావసర సరుకులు తరలిస్తున్న వ్యానును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టామన్నారు.







శ్రీకాకుళం, నీటిపారుదల శాఖ సర్కిల్ నూతన కార్యాలయంను ప్రారంభించిన గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరియు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా అధికారులు.

## బ్రాండిక్స్ యూనిట్-2 ప్రాంగణంలో

# శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం





అచ్యుతాపురం: సెజ్‌లో గల బ్రాండిక్స్ యూనిట్-2 ప్రాంగణంలో బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామి శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి శుక్రవారం తెల్ల వారు జామున శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండిక్స్-2లో పనిచేస్తున్న ఉద్యోగుల కోరిక మేరకు ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఉద్యోగులు స్వామి వారిని దర్శించుకొని విధులకు హాజరౌతారన్నారు. దీని వలన ఉద్యోగులకు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. వినాయక స్వామి వారి ఆలయాన్ని 6 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ సిఒఒ రఘుపతి, బ్రాండిక్స్-2 హెడ్ మోహన్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సర్పంచ్‌పై చర్యలు చేపట్టాలని సిఐకు ఫిర్యాదు

అనకాపల్లి:మండలంలోని సత్య నారాయణ పురం పంచాయితీ వతురీలపేట గ్రామంలో సూపర్ సర్పంచ్ ఆగడాలపై చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం పట్టణ సిఐ విద్యాసాగర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందఠరేగా సిపిఐ నాయకులు వైఎన్ భద్రం మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెంది సొంత ఇళ్లు లేని వారు స్థలాలు ఇప్పించాలని దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని వాపోయారు. వీటిని ఆసరాగా చేసుకొని గ్రామ సర్పంచ్ భర్త కోరాడ మమేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని ప్లాట్‌గా వేసి గ్రామస్థుల నుండి 25వేల నుంచి 50వేల వరకు డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. డబ్బులు ఇస్తే ఎల్‌పిసితో పాటు గృహాలకు లోన్ మంజూరు చేస్తానని చెప్పి నేటికి మంజూరు చేయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక గ్రామస్థులు వేచి ఉండలేక సర్పంచ్ నూకారత్నాన్ని నిలదీయగా అక్రమ కేసులు పెడతానని బెదిరించడంతో దిక్కులేక నిమ్మకుండిపోయారని తెలిపారు. తనకు డబ్బులు ఇచ్చిన వారు నిర్మాణాలు యధేచ్చగా కొనసాగుతుండగా డబ్బులు ఇవ్వని వారి గుడిసెలు తొలగిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అంటున్నా రన్నారు. తక్షణమే ఆర్‌డిఒ విచారణ జరి పించి మహేష్‌పై చర్యలు చేపట్టాలని, అలాగే కేసు నమోదు చేసి పోలీస్ అరెస్టు చేయాల్సిందిగా ఫిర్యా దులో కేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోన లక్ష్మణ్, సూదికొండ మాణిక్యాలరావు, కర్రి అలె గ్జాండర్, ఎ చిన్నా, పిన్నింటి రాజు, కె నూకలక్ష్మి, ఐ లక్ష్మి పాల్గొన్నారు.

### కార్మికులపై డిఎం వేధింపులు ఆపాలని ఆందోళన

అనకాపల్లి: డిపో పరిధిలో అద్దె బస్సు కార్మికులపై డిపో మేనేజర్ వేదింపులు తక్షణమే ఆపాలని హైబస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.భాస్కరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌టిసి డిపో ఆవరణలో డిపో మేనేజర్ వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందఠరేగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, కంపెనీలు కార్మికులకు రవాణా సౌకర్యం కల్పించి పని ప్రదేశానికి తీసుకెళుతున్నాయన్నారు. వికలాంగులు, వృధ్దులు, వివిధ వర్గాలకు రాయితీలు, జర్నలిస్టులకు, పోలీసులకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న ఆర్‌టిసి యాజమాన్యం అద్దె బస్సులకు ఫ్రీ ట్రాన్స్‌పోర్టు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారని పోలీస్ వారికి చూపించడానికి గుర్తింపు కార్డులు కూడా లేవని వాపోయారు. అద్దె బస్సుల్లో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేకపోవడంతో చిన్న చిన్న కారణాలతో ఉద్యోగాల నుండి తొలగించడం దారుణమన్నారు. తక్షణమే కక్షసాధింపు చర్యలు విడిచిపెట్టి తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జరిగే పరిణామాలకు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

శ్రీ వరాహలక్ష్మి నృసింహస్వామివారి దేవస్థానం.. సింహాచలం.. విశాఖపట్నం జిల్లా,
ఆర్.సి.నెం సి3/1345/2017 తేది. 24.11.2017
ఫోన్ నెం. 0891-2764949, 9959446669

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానంనకు సంబంధించి వివిధ తోటల ఫలసాయం అనుభవించు లీజు హక్కు మరియు శ్రీ స్వామి వారికి చెందిన కొండపైన స్టోర్సు, అన్నదానం విభాగము, కొండదిగువ హాస్టల్ మరియు ఎస్.బి.హాస్టల్ విజయనగరం నందు గల ఖాళీ నూనె, జీడిపప్పు, డబ్బాలను తేది.01.01.2018 నుండి తేది. 31.12.2018 వరకు వ్నువి వున్నట్లుగా తీసుకొనుపోవు లైసెన్స్ హక్కు కొరకు తే.08.12.2017దిన ఉదయం గం.11.00ల నుండి కొండ దిగువ విజయరామరాజు కళ్యాణ మండపము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.
ఇతర వివరముల కొరకు కార్యాలయం పని చేయు వేళలయందు తెలుసుకొనవచ్చును.

సం/- కె. రామచంద్రమోహన్
కార్యనిర్వహణాధికారి

# విజయభాను సంపాదకీయం

## రగులుతున్న జాతివైషమ్యాలు

ఒకప్పుడు యుగోస్లావియాకు పరిమితమైన జాతి వైషమ్యాలు ఇప్పుడు యూరప్‌లోని అనేక దేశాలలో రగులుతున్నాయి. ఆస్ట్రియా, జర్మనీ, పోలండ్, హంగరీ మొదలైన దేశాలలో జాతి భావనలు పెరిగిపోయాయి. స్పెయిన్ నుంచి క్యాటలోనియా విడిపోతానంటున్నది. అనేక దేశాలలో వేర్పాటు ఉద్యమాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతివిద్వేషాలను ఎగదోయకుండా, సామరస్యంగా పరిష్కరించుకునే విధానాలను పెద్ద దేశాలు అనుసరించాలె. యుగోస్లావియా ముక్కలు చెక్కలైన తరుణంలో బోస్నియాలో సాగిన జాతి హననం ప్రపంచ చరిత్రలోని అత్యంత విషాద ఘట్టాలలో ఒకటి. ఈ ఊచకోత సాగించిన బోస్నియన్ సెర్బ్ సైనికాధికారి జనరల్ రాట్కో మ్లాడిక్‌కు ప్రత్యేక ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ యావజ్జీవ శిక్ష విధించింది. వేలాదిమంది ఊచకోత సాగించిన నరహంతకుడికి యావజ్జీవశిక్షతో సరిపెట్టడం సబబేనా అనే ప్రశ్న తలెత్తవచ్చు. కానీ సభ్య సమాజం కంటికి కన్ను, పంటికి పన్ను అనే సూత్రంపై నిలబడిలేదు. అతడికి ఎన్ని మరణశిక్షలు వేసినా చేసిన నేరాలతో పోలిస్తే తక్కువే. అతడిని తప్పుపట్టి శిక్షించడం సూత్రబద్ధమైన, ధర్మబద్ధమైన వైఖరి. 1990 దశకంలో సాగిన ఈ మారణకాండ మానవజాతి చరిత్రలోనే అత్యంత రక్తసిక్త అధ్యాయం అయినప్పటికీ, దీనికి అనేక కోణాలున్నాయి. ఒక సైనికాధికారిగా న్యాయస్థానం ముందు మ్లాడిక్‌ను నిలబెట్టినప్పటికీ, ఈ యుద్ధంలో అనేక ప్రత్యక్ష, పరోక్ష పాత్రలున్నాయి. యుగోస్లావియా ఏర్పాటే పరస్పరం పొసగ ని ఆరు రిపబ్లిక్‌ల విలీనంతో జరిగింది. రిపబ్లిక్‌లకు, వాటి పరిధిలోని భిన్న జాతి ప్రాంతాలకు ఎంతో కొంత స్వయం ప్రతిపత్తి ఉండేవిధంగా ప్రయత్నాలు సాగినయి. కానీ దేశం ఏర్పాటు తరువాత సౌహార్దత పెరగలేదు. యుగోస్లావియా కమ్యూనిస్టు పార్టీకి అన్ని ప్రాంతాలలో అనుబంధ శాఖలు ఉంటాయి. కమ్యూనిస్టుల ఏక పార్టీ పాలనలో పార్టీ శాఖలు కేంద్రీకృత అధికారాన్ని ధిక్కరించలేవు. దీంతో స్వయం ప్రతిపత్తి నామమాత్రంగా మారింది. బలమైన కమ్యూనిస్టు నేత టిటో మొత్తం దేశాన్ని ఏకంగా నిలబెట్టాడు. కానీ 1980లో టిటో మరణం తరువాత వైరుధ్యాలు పెల్లుబికాయి. 1990 దశకంలో జాతియుద్ధాలు భగ్గుమన్నాయి. పరస్పర అవగాహన లేని కృత్రిమంగా జాతులను కట్టి పడేస్తే పర్యవసానాలు ఎట్లా ఉంటాయో ఈ యుగోస్లావియా జాతి యుద్ధాలు, జాతి హననాలు చెబుతున్నాయి. 1980 దశకంలో ఏర్పడిన సంక్షోభాలను, జాతి వైరుధ్యాలను ప్రపంచ పెద్దలు సానుకూలంగా పరిష్కరిస్తే ఈ ఊచకోతలు సాగేవి కాదు. యుగోస్లావియా నుంచి అటు బోస్నియా- హెర్జిగోవినా విడిపోయింది. క్రోయేషియా కూడా వేరుపడ్డది. కానీ ఈ వేరుపడిన దేశాలలోని సెర్బులు తాము ప్రాబల్యం కలిగిన ప్రాంతాలు యుగోస్లావియాతోనే ఉండిపోవాలని భావించారు. దీంతో బోస్నియన్ ముస్లింలతో, క్రోట్స్ తో విడిపోయిన దేశాలలోని సెర్బులకు ఘర్షణ మొదలైంది. సెర్బులకు యుగోస్లావియా (సెర్బ్) సైన్యం మద్దతు ఉన్నది. సెర్బులు, బోస్నియనులు పరస్పర ఊచకోతలకు పాల్పడ్డారు. అయితే మొత్తంగా చూస్తే బోస్నియా ముస్లింలపై సెర్బ్ సైనికులు సాగించిన దాడులే భారీగా ఉన్నాయి. బోస్నియా రాజధాని సరయేవోను సెర్బులు దాదాపు మూడేండ్ల పాటు ముట్టడించి సాగించిన దాడులు బీభత్సకరమైనవి. స్రెబ్రెనికా ఊచకోత మరో భయానక ఘట్టం. 1995 జూలైలో సెర్బులు స్రెబ్రెనికా అనే పట్టణాన్ని ముట్టడించి ఎనిమిది వేల మం దికి పైగా ముస్లిం మగవారిని హతమార్చారు. అనేకమంది మహిళలపై లైంగికదాడి చేశారు. 1992 నుంచి 1995 వరకు ముస్లింలను, క్రోట్స్‌ను, ఇతర సెర్బేతర జాతుల వారిని అం దరిని పారదోలి బోస్నియన్ సెర్బులు మాత్రమే ఉండే చిన్న దేశాన్ని ఏర్పరచాలనే లక్ష్యంతో ఊచకోత సాగింది. ఈ ఊచకోతకు జనరల్ రాట్కో మ్లాడిక్ నాయకత్వం వహించాడని ఇంటర్నేషనల్ క్రిమినల్ ట్రిబ్యునల్ నిర్ధారించింది. 1992లో తీవ్ర స్థాయిలో సాగిన ఊచకోతల్లో 45 వేల మంది మరణించారు. రాట్కో మ్లాడిక్‌ను నరహంతకుడిగా నాటో దేశాలు ముద్ర వేశాయి కానీ సెర్బులు అతడిని వీరుడిగా ఆరాధిస్తున్నారు. సెర్బులు, ఇతర జాతుల మధ్య వైషమ్యాలను పెద్ద దేశాలు ఎగదో యడం వల్లనే ఈ స్థాయి ఊచకోతలు సాగాయి. సెర్బులకు రష్యా మద్దతు ఉంటే, ఇతర జాతులకు నాటో సహకారం ఉన్నది. ఊచకోతలను ఆసరాగా చేసుకొని కొసోవా నుంచి సెర్బు సైన్యాలను తరిమివేయడానికి అంటూ నాటో బాంబుల వర్షం కురిపించింది. ఈ బాంబు దాడుల్లో అనేకమంది ప్రజలు మరణించారు. అనేక జనావాసాలు ధ్వంసమయ్యాయి. సెర్బుదాడులను ఖండించినట్టుగా, నాటో బాంబుల దాడిని తప్పు పట్టడం లేదు.

---

### సకల దేవతలకూ ఓంకార ఉపాసన చేసిన

# గురువు షణ్ముఖుడు



విశాఖపట్నం : పార్వతీవరమేశ్వరుల సుపుత్రుడు, సకల దేవతల సర్వసైన్యాధిపతిగా నియమితుడైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి తిథినాడు అవతరించిన గొప్ప రోజు ఈ రోజు అని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పేర్కొన్నారు. విశాఖ శ్రీ శారదాపీఠంలో ప్రతిష్ఠించిన ఆరడుగుల పొడవుగల వల్లీ దేవ సమేత షణ్ముక సుబ్రహ్మణ్య స్వామి విగ్రహానికి శుక్రవారం ఘనంగా విశేష పంచామృతాభిషేకం గావించినారు. ఈ సందర్భంగా మహాస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ సుబ్రహ్మణ్య షష్ఠి తిథి చాలా సుదినమైనదని, ఎందుకంటే తారకాసురుని సంహారం కొరకు అమ్మవారు తన మూడు గొప్ప శక్తులయిన ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తిలను సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అందించిన గొప్ప రోజు అని పేర్కొన్నారు. ఎవరైతే సుబ్రహ్మణ్య స్వామి వారిని ఆరాధిస్తారో వారికి జీవితాంతం సుఖసంతోషాలు కలుగుతాయని, అలాగే వివాహం కాని వారికి శీఘ్రంగా వివాహం జరుగుతుందని, సంతాన లేమికి మంచి సంతానప్రాప్తి కలుగుతుందని తెలిపారు. అటువంటు సుబ్రహ్మణ్య స్వామి ఉభయ రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఆరడుగుల ఎత్తు షణ్ముఖాలతో వల్లీ దేవ సేన సమేతంగా శారదా పీఠంలో ప్రతిష్ఠింపబడి నిత్య ధూపదీప నైవేద్యాలందుకోవడం జరుగుతోందని అన్నారు. శుక్రవారం సాయంత్రం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పై కార్యక్రమాలన్నీ ఉత్తర పీఠాధిపతి బాలస్వామి సమక్షంలో ట్రస్టీలు నరసింహారెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, ధర్మాధికారి కామేశ్వర శర్మ మరియు ఆస్థాన పండితుడు కృష్ణశర్మ పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

---

## ఘనంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవం



షష్ఠి పూజలు నిర్వహించిన గ్రామ పురోహితుడు రవితేజశర్మ

సబ్బవరం : సబ్బవరం మండలంలోని అంతకాపల్లి పంచాయితీ పరిధిలోని లగుడువారు ఇల్లులు దగ్గర శ్రీ స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం శుక్రవారం ఆలయం కమిటీ వారు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. శుక్రవారం 6 గంటల నుండి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మండప పూజలు, సహస్ర భస్మార్చన, మంత్ర పుష్పములు, షష్ఠి పర్వదినంలో భాగంగా గ్రామ పురోహితుడు రవితేజశర్మ పంతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ పూజల్లో 108 దంపతులు పాల్గొని పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. మరియు భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం మూడువేల మందికి అన్న సమారాధన ఆలయ కమిటీ అధ్యక్షుడు వెన్నల సత్యనారాయణ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వెన్నల స్వామి, వనం చెల్లారావు, వనం సత్తిబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

---

### ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్

## ఖేల్ మహోత్సవ్-2017 ఉత్సవాలు



విశాఖపట్నం : ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఆనందపురంలో ఖేల్ మహోత్సవ్-2017 ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిండికేట్ బ్యాంక్ జనరల్ మేనేజర్ కె.జగన్మోహన్ ప్రహ్లాద్ పాల్గొని శాంతి పావురాలను, క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత క్రీడాకారులు, అథ్లెట్లు, క్రికెటర్లు, కరాటే వీరులు కళ్లముందు సాక్షాత్కరింపబడేసినట్లు పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ డా.ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను బయటకు తీయాలన్న వారిలోని మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలంటే క్రీడలు ఎంతైనా అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ధనుంజయరావు, వైస్ ఛైర్మన్ రేవంత్ విశ్వనాధ్ క్రీడోత్సవాలను పర్యవేక్షించి చిన్నారులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొని ఈ క్రీడాత్సోవాన్ని విజయవంతం చేశారు.

---

## కవి సమయం

### 'అడుకున్నోళ్లు'

ఎవడు కాదురా!... అడుకున్నోడు
అమ్మ కన్న ప్రతీ ఒక్కరూ- అడుకున్నెళ్లే!
సమాజమే రక-రకాల అడుకున్నోలతో
గూడు కట్టింది
అమ్మా! ఆకలి - అయ్యా! ఆకలి
ధర్మం చెయ్యండి బాబు
డోలు పట్టుకున్నేడే! ... అడుకున్నోడా!
మానవ జన్మే... అడుకున్న జన్మ
అమ్మా!... నీ ఓటు
అయ్యా! ... నీ ఓటు
నీ ఓటుకి... నా నోటు
గద్ప... గద్ప తిరిగే వాళ్లు అడుకున్నోళ్లు కారా!... "ఎవడు"
రండి... రండి మా దగ్గర కొనుగోలు చెయ్యండి
మీకు రాయితీలు ఇస్తాం రండి
అందరికంటే మా దగ్గరే
పరిపూర్ణమైన - నాణ్యమైన వస్తువు లభిస్తుంది
మీరే మా కస్టమర్ దేవుళ్లు
వెలకమ్... వెలకమ్... వాళ్లు అడుకున్నోళ్లు కారా!... "ఎవడు"
టికెట్... టికెట్
మా బస్సే... ఎక్కండి
మా ఆటో... ఎక్కండి
సుస్థిర స్థానముకై సుఃఖ ప్రయాణం
సాగిస్తాం రండి... ట్రావిలర్స్ అడుకున్నోళ్లు కారా!
మా బడిలో చేర్చండి... మీ పిల్లలకు
ఫోన్లు మీద ఫోన్లు
ఇంటి చుట్టూ తిరిగే విద్యాసంస్థలు అడుకున్నోళ్లు కారా! "ఎవడు"
వరకట్నం అంటూ;
లాంచనాలు అంటూ;
అభలల దగ్గర కోరుకోవడం
మగోళ్లు... అడుకున్నోళ్లు కారా!...
ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ; నిరుద్యోగ యువత దగ్గర
లంచాలు బుక్కేవాళ్లు అడుకున్నోళ్లు కారా!... "ఎవడు"

...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం: 7702977293

---

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : సప్తమి తె.4.34; శ్రవణం ఉ.9.17 మ.వ.1.34ల 3.16.

శనివారం 25-11-2017

**మేషం** : స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. **మిథునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరదు. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. నిర్మాణ పథకాలలో పురోభివృద్ధి కానవస్తుంది. ఉద్యోగస్తులు తోటివారి కారణంగా అధికారులతో మాటపడవలసి వస్తుంది. **కన్య** : లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధు మిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

**తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి.

**వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం.

**ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి.

**మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు.

**కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుతమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. **మీనం** : ఆర్థిక విషయాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.

---

# రహదారి భద్రత నిధి రూ. 50 లక్షలకు వారంలో ప్రతిపాదన

- జాతీయ రహదారిలో ఎన్‌హెచ్‌ఏఐ, 108 అంబులెన్స్‌ల పొజిషన్‌పై వారంలో మ్యాపింగ్
- సెంట్రల్ మీడియన్‌ల తొలగింపుపై రహదారి భద్రతకే పెద్ద పీట
- నర్సీపట్నం-అడ్డురోడ్డు రహదారిలో బ్రిడ్జి మరమ్మతు, కల్వర్టుల విస్తరణపై తనిఖీ నివేదిక
- రహదారి భద్రతలో 31,503 కేసులు బుక్ చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా
- జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన రహదారి భద్రత నిధి రూ. 50 లక్షలకు వారం రోజుల్లో ప్రతిపాదలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సిటీ, రూరల్ పోలీస్ అధికారులుచేసిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. శుక్రవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అద్యక్షతన రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. పోలీసు కమిషనర్ టి. యోగానంద్, నర్సీపట్నం సహాయ పోలీసు సూపరింటెండెంట్ ఐశ్వర్య రస్తోగితో కలిసి రోడ్డు ప్రమాదాల నివవరణకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత అంశంలో ఎటువంటి రాజీ లేకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారికి అనుసంధానం అయ్యే అనకాపల్లి, తాళ్లపాలెం జంక్షన్లలో సెంట్రల్ మీడియన్లను తొలగించాలని స్థానికుల నుండి వత్తిడి వస్తున్నట్లు అదికారులు కలెక్టర్ దృష్టికి తేగా రహదారి భద్రతకే పెద్ద పీట వేయాలని, ఎటువంటి వత్తిడులకు లొంగవద్దని అధికారులను ఆదేసించారు. నోవోటెల్, భీమిలి క్లాక్ టవర్ ప్రాంతాలలో మీడియన్ల తొలగింపుపై చర్యలుచేపట్టాలన్నారు. జాతీయ రహదారిలో 108 అంబులెన్స్‌ల పొజిషన్‌పై వారంలో మ్యాపింగ్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నర్సీపట్నం ఏఎస్‌పి చేసిన విజ్ఞప్తికి కలెక్టర్ స్పందిస్తూ స్థానిక బ్రిడ్జి మరమ్మతులు, కల్వర్టుల పనులపై అధికాలుతో సమీక్షించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై భద్రతా చర్యలు గట్టిగా చేంపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పోలీసు కమిషనర్ టి. యోగానంద్ మాట్లాడుతూ రహదారి భద్రతకు అవసరమైన సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు పనులను ప్రాజెక్టు రిపోర్టులోనే పొందుపరిస్తే ఎటువంటి సమస్యలు రావని, సకాలంలో ప్రమదాలు నివారించవచ్చునని సూచించారు. ఉప రవాణా కమిషనర్ ఎస్. వేంకటేస్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అక్టోబర్ మాసంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, వాటి నివారణకు తీసుకున్న చర్యలను గురించి వివరించారు. రహదారి భద్రత అంశంలో 31,503 కేసులు బుక్ చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాగా గుర్తింపు పొందిందని తెలిపారు. అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్ మహేంద్ర పాత్రుడు, ఆర్‌టిఓలు, ఏహెచ్‌ఖాన్, తదితరలుతో పాటు రవాణా, ఎక్సైజ్, రోడ్లు, భవనాలు, పంచాయితీరాజ్, నేషనల్ హైవే, జివిఎంసి, ఆర్‌టిసి తదితర శాఖలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## 26న సర్వసభ్య సమావేశం

కోటవురట్ల : ఈ నెల 26వ తేదీన కోటవురట్ల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.కళ్యాణి తెలిపారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. కావున వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా విజయ్ జన్మదిన వేడుకలు



బిసి వసతి గృహం బాలికలకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : మంత్రి అయ్యన్న తనయుడు విజయ్‌బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం నర్సీపట్నంలో నిర్వహించారు. రక్ష స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బిసి బాలికల వసతి గృహంలో బాలికలకు స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు తనయుడు దొరబాబు, అయ్యన్న యువసేన ప్రతినిధులు వంశీ, వసతి గృహం వెల్ఫేర్ అధికారి సిహెచ్.సావిత్రి, వసతి గృహం విద్యార్థినులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో 42,131 అగ్రిగోల్డ్ బాధితుల వివరాలు వెరిఫికేషన్

### ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి



మాట్లాడుతున్న ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి

నర్సీపట్నం : నర్సీపట్నం డివిజన్‌లో ఇప్పటి వరకు 42,131 మంది అగ్రిగోల్డ్ బాధితుల వివరాలు వెరిఫికేషన్ చేసినట్లు నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి అన్నారు. శుక్రవారం ఏఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో 42,131 మంది వెరిఫికేషన్ చేయించగా ఇంకా 25,880 మంది నమోదు కావల్సి ఉందన్నారు. ఈ నెల 30తో బాధితులు వెరి ఫికేషన్ చేయించు కోవాలన్నారు. నవంబర్ 30 తర్వాత నర్సీపట్నం లోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట చేస్తామన్నారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ ఎస్సై సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై శేఖరం

రావికమతం : నిబంధనలకు విరుద్దంగా ఆటోలను నడిపితే చర్యలు తప్పవని కొత్తకోట ఎస్సై శేఖరం తెలిపారు. శుక్రవారం కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఆవరణలో శ్రీశాంతి ఆటో యూనియన్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెడితే ఆటోను సీజ్ చేస్తామన్నారు. ఆటో రికార్డులన్ని సక్రమంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు లైసెన్సు లేని డ్రైవర్లు తమ వద్దకు వస్తే లైసెన్సు తొందరగా వచ్చే విధంగా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆటోను పరిమితికి మించి వేగంగా నడిపితే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడపరాదన్నారు. ప్రయాణికుల పట్ల శౌక్యంగా ఉండాలన్నారు.

## 26న అరకులోయలో గిరిజన చైతన్య సమ్మేళనము

అరకులోయ: ఈనెల 26వతేదీన ఆదివారం అరకులోయ ఎన్‌టిఆర్ మైదానంలో గిరిజన సంస్కృతి చైతన్య సమ్మేళనము కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రవనవాసి కల్యాణ్ ఆశ్రమ స్వాగత సమితి అధ్యక్షులు రేగం మత్స్యలింగం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారం కొరకు గిరిజన చైతన్య సమ్మేళనం జరుపుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమ్మేళనంలో గిరిజనుల ఆర్ధిక సమస్యలు, ప్రభుత్వం పరిష్కరించవలసిన సమస్యలపై చర్చించడం జరుగుతందని ఆయన తెలియజేశారు. ఈ సమ్మేళనానికి అధిక సంఖ్యలో గిరిజనులు తరలిరానున్నారని ఆయన చెప్పారు. 26వతేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభం కాబోయే సమ్మేళనంలో గిరిజనులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్వాగత సమితి కార్యదర్శి గోపినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి, నట్టేట ముంచుతున్నాయి...

**- వెలుగు చూస్తున్న ప్రైవేటు కంపెనీలు మోసాలు..**
**- అయినా మారని ప్రజలు.., కోట్లాది రూపాయిల ప్రజాధనం వసూళ్లు..**
**- గడువులు ముగిసినా జరగని చెల్లింపులు**

చోడవరం: తమ సంస్థల్లో పెట్టుబడులు పెడితే, భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామంటూ మహిళలు, అమాయకులను కొన్ని ప్రైవేటు కంపెనీలు నమ్మిస్తున్నాయి. కోట్లాది రూపాయిల ప్రజాధనం వసూళ్లు కాగానే చెల్లింపులు చేయకుండా పెట్టుబడిదారులకు నరకం చూపుతున్నాయి, ఖాతాదారుల కళ్లుగప్పి దర్జాగా ఉడాయించేస్తున్నాయి. ఒక్కో వ్యక్తి వారి స్థోమతను బట్టి వాయిదాలు లేదా ఫిక్సుడు డిపాజిట్లు చెల్లించాలన్నది నిభంధన. వారు చెల్లించే మొత్తం, దాని వడ్డీని ( 8.7 నుండి 9 శాతం) నిర్ణీత కాలపరిమితికి లెక్కించి వారికి ప్రమాణపత్రం (బాండు) ముందుగానే జారీ చేస్తున్నారు. కొందరు మాజీలు, అధికార నేతలు ఎం.డి.లుగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లో తమ శాఖలు విస్తరిస్తున్నారు. కొందరు నిరుద్యోగులు, చిరుద్యోగులను కమీషను ఏజంట్లుగా పలు శాఖల్లో పెట్టుబడిదారులుగా చేర్పిస్తున్నారు. పెట్టుబడిదారుల సొమ్ము కోట్లు దాటి, వారి గడువు ముగిసినప్పటికి తిరిగి చెల్లింపులకు నోచుకోపోతుండటంతో చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే, ప్రస్తుతం సొమ్ములు లేవు పట్టణాల్లో ఇళ్ల స్థలాలిస్తామంటూ మభ్యపెడుతున్నారు అని బాధితులు వాపోతున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే, అదనపు ఆదాయానికి ఆశించి ఇటువంటి కంపెనీల్లో చేరిన కమీషను ఏజంట్లు, పెట్టుబడిదారులను చూపించిన పాపానికి నరకం అనుభవి స్తున్నారు. పెట్టుబడిదారుల ఒత్తిల్లు భరించలేక ఆత్మహత్యకో, ఊరు విడిచి వెళ్లిపోవలసిన పరిస్థితి. కళ్లముందే ఇన్ని మోసాలు జరుగుతున్నా, మళ్లీ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే ప్రైవేటు కంపెనీల మోసాలకు నేటి తరం వాళ్లు బలవుతున్నారు. దీనికి కంపెనీ చట్టం క్రింద ప్రభుత్వమే అడ్డుకట్ట వేయాల్సిందిగా పలు ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నాయి.

## రైవాడలో యువకులు జల విన్యాసాలు

**- ప్రమాదం అంచున ఈత సరదా**



దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయంలో యువకులు జల విన్యాసాలు హదుమీరుతున్నాయి .ఈత సరదా యువకుల ప్రాణాలు మీదకు తెచ్చే ప్రమాదం ఉన్న పట్టించుకోకుండా జలాశయంలో మునిగితేలుతున్నారు .కార్తీక మాసంలో మొదలెట్టిన ఈత సరదా స్థానిక యువతకు ఇంకా తీరలేదు .రైవాడ జలాశయం నుంచి వరద నీరు విడుదల చేసే రేగులేటింగ్ గేట్ల నుంచి జశయంలోకి దూకి ఈత వేస్తున్నారు .జరగరానిదేమైనా జరిగితే ఎవరు ..బాజ్యులనీ పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు .జలాశయం అధికారులు స్పదించి గేట్ల నుంచి దూకే యువకులకు అడ్డు కట్టవేసేలా చర్యల చేపట్టాలని పర్యటకులు కోరుతున్నారు.

## దేవాలయంలో జోరుగా హుండీ చోరీలు

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి తో పట్టు పలు గ్రామాల్లో ని దేవాలయంలో హుడి చోరీలు జోరందుకున్నాయి .తాజాగా దేవరాపల్లి లొని రెండు ప్రధాన ఆలయాలలో దొంగతనాలు జరిగాయి .స్థానిక ఉమామహేశ్వరి దేవి ఆలయంలో గురువారం రాత్రి హుడి చోరీకి గురైంది .గత రెండు రోజుల క్రితం జూనియర్ కళాశాల వద్ద ఉన్న వానదేవీశ్వరా అలయంలో హుడిని దొంగలూ ఎత్తుకుపోయారు .ఈ సంఘటన మరవకు ముందే ,మరో ఘటన జరగడంతో స్థానికుల్లో భయం మొదలైంది .దీనిపై పోలిసులకు ఉమామహేశ్వరి దేవీ అర్చకులు సూర్యనారాయణ మూర్తి పిర్యాదు చెసారు .కేసు నమోదు చూసి దర్యాప్తు చూస్తున్నట్టు పోలీసులు తెలిపారు .ఇదిలాగుండగా ఇటీవల కాలంలో మండలం లొని పలు గ్రామంలో ని అలయాలలో హుడి చోరీలు జరిగిన పోలీసులు పట్టించుకోలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

## బీసీ వెల్ఫేర్ అక్రమాలపై చర్యలు ఉండవా?

విశాఖపట్నం : విశాఖ జిల్లా బీసీ వెల్ఫేర్‌లో దొంగలు పడ్డారు. మొత్తం బీసీ వెల్ఫేర్ ను నాశనం చేస్తున్నారు. ఈ దొంగలు ఎక్కడ నుంచో రాలేదు. జిల్లా ప్రభుత్వ అధికారులు పక్కా ప్రణాళికతో, నఖిలి రికార్డులతో, ట్రెజరీకి నఖిలి రికార్డులతో ట్రెజరీకి నఖిలి బిల్లులు పెట్టి కోట్లాది రూపాయలు దోచేస్తున్నారు. ఇందులో డిప్యూటీ డైరెక్టర్ డి. నాగేశ్వరరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కెవిఎస్ ప్రకాశరావు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ అక్రమాలను సహ ఉద్యోగులు కొందరు వ్యక్తులు ఆధారాలతో, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమీషనర్‌కి ఫిర్యాదు చేసిన మూడు సంవత్సరాల నుండి ఎటువంటి చర్యలు లేవు. ఏసీబీ విజిలెన్స్‌కి ఫిర్యాదు చేసిన తరువాత ఏసీబీ విచారణ చేసి కూడా, ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో సంచలనాలు సృష్టిస్తున్న ఏసీబీ బీసీ వెల్ఫేర్‌లో జరుగుతున్న అక్రమాలపై, మౌనంగా ఉండటం అనేక అనుమానాలకు, దారితీస్తుంది. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన, ఎటువంటి చర్యలు ఉండటం లేదు. వివరాలలోకి వెళ్లే విశాఖజిల్లాలో 2010 వ సంవత్సరంలో అవుట్ సోర్సింగ్ వర్కర్ల్ కళాశాల హాస్టల్‌కి 90 మంది ప్రిమెట్రిక్ హాస్టల్‌కి 22, మొత్తం 112 మంది ఔట్ సోర్సింగ్ వర్కర్ల పోస్టులు మంజూరయ్యాయి. ఈపోస్టులను, ఇద్దరి కాంట్రాక్టర్ల ద్వారా, తీసుకున్నారు. కాని చాలా పోస్టులను నింపలేదు. మొత్తం పోస్టులు నింపినట్లు, చూపించి, నఖిలి రికార్డులను మాత్రం సృష్టించి, నఖిలి బిల్లులతో ట్రెజరీని మోసం చేస్తూ, కోట్లాది రూపాయలను కాజేశారు. ఇందులో అక్రమాలు తెలియాలంటే, వర్కర్ లందరికి బ్యాంకు ద్వారా జీతాలు ఇవ్వాలి. ఈ వర్కర్ల అకౌంటులను ఇప్పటి నుండి ప్రారంభిస్తే అప్పటి నుండి వర్కర్లు పనిచేసినట్లు, అలా అని, అందరికీ ఈఎస్ఐ మరియు పిఎఫ్ ఎప్పటి నుండి అమలు జరిగితే అప్పనుండి వర్కర్లు పనిచేస్తున్నట్లు తెలిసిపోతుంది. వర్కర్లకు సరిగా జీతాలు ఇవ్వడం లేదు. ఒకొక్క అవుట్ సోర్సింగ్, ఉద్యోగానికి లక్ష రూపాయలు తీసుకున్నారు. వీరి ద్వారా కోటి 20 లక్షల తీసుకున్నట్టు బోగట్టా. ఈ విషయంపై అవుట్ సోర్సింగ్ వర్కర్లను విచారిస్తే అనేక అక్రమాలను వెలుగుచూస్తున్నాయని, చెపుతున్నారు. పూట గడవని వ్యక్తి, జేబుల దొంగతనం చేస్తే కఠినమైన శిక్షలు పడతాయి. అలాంటిది లక్షలాది రూపాయలుగా జీతాలు తీసుకుని, కోట్లలలో అక్రమంగా దోచేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో చింతపల్లి, ట్రెజరీ కుంబకోణం ఎంత సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే నఖిలీ బిల్లులతో ట్రెజరీని దోచేస్తున్న వీరి అక్రమాలు అన్నీ సంచలనం సృష్టించే అవకాశం ఉందని శ్రేణిలో ఉంది. ఈవిషయంపై జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి వివరణ కోరగా ...

ఈ కాజేస్తున్న సొమ్మును డిప్యూటీ డైరెక్టర్‌కి రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమీషనర్‌కి వాటాలు ఇవ్వాలని, నేను ఒక్కడినే తీసుకోనని, చెపుతున్నారు. ఇప్పటికైనా, ఏసీబీ డీజీ ఠాగూర్, జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి, తగిన చర్యలు తీసుకుని దోచిన సొమ్మును తిరిగి రికవరీ చేయించాలని, బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## డిసెంబర్ 1 నుంచి ఇగ్నో పరీక్షలు


విశాఖపట్నం : .ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)వెబ్ సైట్ లో హాల్ టికెట్స్ అప్లోడ్ చేయబడ్డాయి. ఇగ్నో అధ్యయన కేంద్రాలయిన విశాఖపట్నం, కాకినాడ మరియు రాజమహేంద్రవరం లలో పరీక్షలు జరుగును . ఇగ్నో డిసెంబర్ 01, 2017 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ ఇగ్నో వెబ్ సైట్ www.ignou.ac.in నందు లభించు చున్నవి. ఇగ్నో పరీక్షలు డిసెంబర్ 1 నుంచి 23 వరకు జరుగును. విద్యార్థులు పరీక్షల హాల్ టికెట్స్ లను ఇగ్నో వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకొనవలెను. ఇగ్నో జారి చేసిన ఐడెంటిటీ కార్డు మరియు హాల్ టికెట్స్ లను తీసుకొని పరీక్షలకు హాజరు కావలెను. ఇగ్నో పరీక్షలు డా. బుల్లయ్య కాలేజీ, విశాఖపట్నం, ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం మరియి ఐడియల్ కళాశాల, కాకినాడ నందు జరుగును. మొబైల్ ఫోన్స్ పరీక్షా కేంద్రమందు అనుమతించబడవు. పరీక్షలుసమర్ధవంతముగా మరియు పారదర్శకంగా జరుగుటకు ఇగ్నో అన్ని ఏర్పాట్లు చేసింది.మరిన్ని వివరాలకు ఉషోదయ జంక్షన్, ఎంవీపీకాలనీలో వున్న ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రాన్ని 0891- 2511200/300/400, మొబైల్ : 84 990 844 28 ఫోన్ నంబర్స్ ద్వారా సంప్రదింగలరని డా. ఎస్. రాజారావు తెలిపారు.


## అరకులోయలో ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి



అరకులోయ: మండల కేంద్రమైన అరకులోయలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక యల్లారమ్మతల్లి దేవాలయం వద్ద ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవాలయానికి వేకువజాము ముందే భక్తులు తరలివచ్చి వారికి ఘనంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. యల్లారమ్మతల్లి ఆలయ వ్యవస్థాపకురాలు శాంతమ్మతల్లి పర్యవేక్షణలో శ్రీను పంతుల ఆధ్వర్యంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణం కనులారి తిలకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. అన్న సమారాధన కార్యక్రమానికి అరకులోయ లాయర్ శ్రీరాములు దంపతులు సహాయ సహకారాలు అందజేశారు. సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా యల్లారమ్మతల్లి ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.

## శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు






విశాఖపట్నం: నగరంలో గల శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నవంబర్ 19న ప్రారంభమైన మార్గశిరమాసోత్సవాలు సందర్భంగా శ్రీ చక్రనావావరనార్చన, లక్ష్మీహోమం, వేదపారాయణ, సపతశతీ పారాయణ, మహావిద్యాపారాయణ నిర్వహించారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని అనాకపల్లి నియోజకవర్గం పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సీఎంఆర్, ఎంవిఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారిణి యస్‌జె.మాధవి, పి.రామారవు, ఎస్.సూర్యకుమారి, పి.శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం ముఖద్వారము ఏర్పాటు

**ముఖ్య అతిథిలుగా హాజరైన సర్పంచ్, ఎంపీటీసీలు**



పరవాడ : పరవాడమండలం పరవాడ గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం కు శుక్రవారం సింహాద్వారం అవిష్కరణ కార్యక్రమం ఘనం గా జరిగింది.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధులు గా పరవాడ సర్పంచ్ చుక్క రామునాయుడు, పరవాడ ఎంపీటీసీ సభ్యులు పైల శ్రీనువాసరావు,సిరపురపు అప్పల నాయుడు హాజరైనారు,ముందుగా శివునకు పూజలు చేసి తరువాత సింహాద్వార అవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నకు పైల రామచంద్రరావు,రెడ్డి శ్రీనువాసరావు, చుక్కరవికుమార్ ,బండారు రామారావు, వర్రిహరి, మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 25 వరకు అగ్రిగోల్డ్ బాండ్లు పరిశీలన

నాతవరం : ఈ నెల 25వ తేదీ వరకు అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందని నాతవరం ఎస్సై జి.అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 1500లకు పైగా బాండ్ల పరిశీలన ,ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఈ నెల 25లోగా చేయించుకోవాలని సూచించారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యంస్వామి షష్ఠి పూజ



సింథియా: జీవీయంసీ45వ వార్డు ఏకేసి కాలనీలోని రామాలయంలో శుక్రవారం వైభవంగా సుబ్రహ్మణ్యం స్వామి షష్ఠి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్యం స్వామికి పంచామృతాభిషేకాలను అర్చకుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు వైకాపా అధ్యక్షులు గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఏడాది సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, పాల్గొన్న భక్తులకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక గవరరాజుభవాని, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎంజేజేబివై చెక్కుల పంపిణీ

మాకవరపాలెం : అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన(పిఎంజేజేబివై) నగదు చెక్కులను పంపిణీ చేశారు. తామరం గ్రామానికి చెందిన మైచర్ల అప్పలకొండ, దలియా అచ్చియ్యమ్మలు ఇటీవల మృతి చెందారు. వీరికి పిఎంజేజేబివై నుంచి రూ.2లక్షలు అందనుంది. దీనిలో తొలి విడతగా రూ.5వేలు చొప్పున వారి కుటుంబ సభ్యులకు వెలుగు సిబ్బంది పంపిణీ చేశారు.

ఇళ్లు, అపార్ట్‌మెంట్, ఇళ్ల స్థలములు కొనాలన్నా, అమ్మాలన్నా, తనఖా, అన్ని రకముల లోన్ సదుపాయములు బ్యాంక్ ద్వారా సమకూర్చుటకు సంప్రదించగలరు.
79815 79817

# సునామి నివారణకు అవగాహన సదస్సు



యానాం : తీరప్రాంతాల్లో సంభవించే సునామి నుండి రక్షణ పొందేందుకు తీసుకోవలసిన చర్యలపై వివిధ గ్రామాల మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని ఎన్‌ఎసి జెట్టీ వద్ద మత్స్యశాఖ ఏర్పాటుచేసిన సునామి అవగాహన సదస్సులో సునామి సంభవించినప్పుడు గృహాలు ఎలా కూలి పోతాయో వాటినుండి ఎలా రక్షణ పొందాలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలన్న అంశాలపై మత్స్య, పోలీసు, అగ్నిమాపక, వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రజలకు ఏవిధమైన వసతి భోజన వైద్య సౌకర్యాలపై స్థానిక మార్కెట్ కాంప్లెక్స్‌లో వివరించారు. అయితే ఈ కార్యక్రమానికి జనం ఎక్కువగా తరలి రాకపోవడంతో నామమాత్రంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పరిపాలనాధికారి ప్రభుత్వ ఆసుపత్రి డిడి ఎంవిఎస్ ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ జి . గౌరీ సరోజిని, ఎస్‌పి నితిన్ గోహల్, ప్రజా పనుల శాఖ ఎఇ మేడిశెట్టి శ్రీనివాసు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

తాళ్లరేవు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరంచేస్తామని మత్స్యకార ఎస్టీ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. తాళ్లరేవులోని గాంధినగర్‌లో మత్స్యకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మత్స్యకారులకు పింఛన సదుపాయం కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. చమురు సంస్థల కార్యకలాపాలతో వీరి జీవనోపాధి తీవ్రంగా దెబ్బ తింటుందన్నారు. చమురు సంస్థ ఉన్న ప్రాంతాల్లో మత్స్యకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. వేట నిషేద సమయంలో 100 కిలోల బియ్యం, రెండు నెలలకు 10 వేల రూపాయలు పరిహారం ఇవ్వాలన్నారు. ఇతర కార్పొరేట్‌లకు ఇచ్చే మాదిరిగానే వేయి కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ హక్కులపై డిసెంబర్ 2న కాకినాడ అంబేద్కర్ భవన్‌లో జిల్లా మత్స్యకారులకు అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో మత్స్యకారులు రావాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లాడి హనుమంతరావు, పి. భైరవమూర్తి, గంగాధర రావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ భవన నిర్మాణాన్ని త్వరతగతిని పూర్తి చేయాలి

భీమునిపట్నం : భీమిలిలో గల కస్తూరిబా గాంధీ భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చెయాలని భీమిలి ఇన్ ఛార్జ్ చుక్కా విజయబాబు కోరారు. ఆయన మాట్లాడుతూ ఈ భవనం బాలికల విద్యాలయం కనుక దీని చుట్టూ ప్రహరికి కూడా అంచనాలు తయారు చేసి నివేదికను మంత్రి గంటా శ్రీనివాసరావుకు అందచేయాలని అన్నారు ఈ భవనమును రూ 1.25కోట్లుతో నిరిమిస్తున్నారని అలాగే నేరళ్లవలస లో నిర్మిస్తున్న స్ట్రీట్ చిల్డ్రన్స్ హోం ను కూడా ఆయన పరిశీలించారు. దీనిని కూడా వేలైనంత త్వరగా నిర్మించాలని కోరారు. అయన వెంట ఆర్.వీ.ఎం. ఈ ఈ శ్రీనివాసరావు, డి.ఈ .శశిధర్ లు పాల్గొన్నారు.

# మీగడకి లోక్‌నాయక్ పురస్కారం

## – 2018 సంవత్సరానికి ఎంపిక – జనవరి 20న ప్రధానం

## పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం : తెలుగువారి జ్ఞానపీఠంగా ప్రసిద్ధి చెందిన లోక్‌నాయక్ ఫౌండేషన్ వార్షిక సాహిత్య పురస్కారం 2018 సంవత్సరానికి గాను ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు మీగడ రామలింగస్వామిని ఎంపికచేసినట్లు లోక్‌నాయక్ ఫౌండేషన్ అధ్యక్షుడు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. విఐపి రోడుడ్డలో గల లోక్‌నాయక్ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ పురస్కారాన్ని 2018 జనవరి 20వ తేదీన మాద్దిలపాలెం కళాభారతిలో జరగనున్న కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ లావు నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. స్వర్గీయ ఎన్.టి. రామారావు, హరివంశరాయ్ బచ్చన్‌ల వర్ధంతి సందర్భంగా పురస్కారాన్ని ప్రదానం చేస్తామన్నారు. ఈ పురస్కారం క్రింద లక్షా యాభైవేల రూపాయలు నగదు, జ్ఞాపికను అందచేస్తామన్నారు. సాహిత్య, సంస్కృతి అభివృద్ధి విశేషంగా కృషిచేస్తున్న తెలుగువారికి ఏటా ఈ అవార్డును ప్రధానం చేయటం జరుగుతొందని యార్లగడ్డ తెలిపారు.

నటునిగా, రచయితగా, దర్శకునిగా, నాటక కర్తగా తెలుగునాట సుప్రసిద్ధులైన మీగడ రామలింగస్వామికి 2018 సంవత్సరానికి గాను జ్యూరీ నిర్ణయించిదని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో జన్మించిన మీగడ రామ లింగస్వామి అనేక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు, బిరుడులు పొందారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాబయ్య పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్టి మహోత్సవం

రావులపాలెం : మార్గశిర శుద్ద షష్ఠిరోజున సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనం చేసుకోవడం వల్ల జాతకరీత్యా సకల దోషములు తొలగి, సంపూర్ణ శరీర ఆయురారోగ్యములు, అష్టైశ్వర్యములు కలిగి, నాగదోషములు తొలగి, సుఖ శాంతులతో ఉంటారని వేద పండితులు పెడసగంటి సీతారామమూర్తి శర్మ అవధాని తెలిపారు.

శుక్రవారం షష్ఠి మహాపర్వదినం పురస్కరించుకొని మండలంలోని అన్ని సుబ్రహ్మణ్యశ్వర ఆలయాలు భక్తులతో తెల్లవారు ఝాము నుండి కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యేశ్వరునికి అర్చకులు విశేషంగా భక్తులు అభిషేకాలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా భక్తులు పాల్గొని స్వామిని స్వామిని దర్శించుకొని పూలు, పడగలు స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రావులపాలెం శివాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్కి గురువారం రాత్రి అత్యంత వైభవంగా శైవాగమాచారం ప్రకారం ఆలయ అర్చకులు శివ, కలగ శ్రీనివాస శర్మలు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవానికి భక్తులు విశేషంగా పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

శుక్రవారం మధ్యాహ్నం స్వామి వార్కి ఆలయ కమిటీ చైర్మన్ కొవ్వూరి జగన్నాథరెడ్డి అధ్యక్షతన మేళ తాళాలు, గారడీలు, బ్యాండు మేళాలు, వివిధ వేషధారణలు, అమ్మవారి అలంకరణలు, చిన్నారుల కోలాటాలు, బాణా సంచా కాల్పుల నడుమ రధోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.

మండలంలో భక్తులకు ఎటువంటి అవాంచనీయ సంఘట నలు జరగకుండా ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ తమ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, స్కాట్ విద్యార్థులు, స్కూలు పిఇటిలు, సత్యసాయి సేవా సంస్థల సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్రమణ్యషష్టి

యానాం : సుబ్రమణ్యస్వామి సష్టిని యానాంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున భక్తులు గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్థానిక శివాలయంలోని సుబ్రమణ్యస్వామికి భక్తులు బారులుతీరి పుజ్యలు నిర్వహించారు. దీంతో శివాలయ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడుతూ పండగ వాతావరణం నెలకొంది. దేవస్థాన కమిటీచైర్మన్ కాపుగంటి ఉమా శంకర్, దేవలాయ అవరణలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎటువంటి అసౌకర్యం లేకుండా ఎస్‌పి నితిన్ గోహల్ ఆదేశాల మేరకు సిఐ కైదీయాజం ఎస్ఐ ఇ. శివకుమార్‌లు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వాహనాదారుల వద్దకే డ్రైవింగ్ లైసెన్సులు

పెద్దాపురం : రోడ్డు ప్రమాదాల వలన యువతరం ప్రాణాలు అన్యాయంగా కోల్పోతున్న ఈ సమయంలో యువత చెంతకే లైసెన్సు విధానాని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతకు వెంటనే ఎల్ఎల్ఆర్ లైసెన్సు ఇవ్వబడునని ప్రతి శుక్రవారం, కళాశాలలకు తమ సిబ్బంది వెళ్ళి వీటిని జారీచేస్తారన్నారు. దీనితోపాటు వయస్సు నిర్ధారణ పత్రం, ఆధార్‌కార్డు, కలర్‌ఫోటో, నిర్ణీత రుసుము రూ. 1200 చెల్లించి ఎల్ఎల్ఆర్ మంజురుచేయబడునని తెలిపారు. ఈ అవకాశాం యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భక్తి శ్రద్ధలతో సత్యసాయి జయంతి వేడుకలు

పెద్దాపురం : స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్దగల సత్యసాయి మందిరం వద్ద సాయిబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని పురవీధులలో ఊరేగించి, అనంతరం మందిరంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## గొల్లపాలెంలో సత్యసాయి జన్మదిన వేడుకలు

కాజులూరు: భగవాన్ సత్యసాయి బాబా 92వ జన్మదిన వేడుకలు మండలంలో ఆయన భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గొల్లపాలెంలో సత్యసాయి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో వేకువజామున నాలుగు గంటలకు నగర కీర్తన, భజన, కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పేదలకు సుమారు 200 మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి బాబా కమిటీ సభ్యులు ఇ రెడ్డి సత్యనారాయణ, ప్రసాద్, గంట ధనరాజు, గంటా రమేష్, దాసరి బాబులు, రామోజు సూరిబాబు, వి. గణపతిలు పాల్గొన్నారు.

## అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా జితేంద్ర నియామకం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం దేవస్థానం ఈవో కాకర్ల. నాగేశ్వరరావు పదోన్నతిపై వెళ్ళిన దగ్గర నుండి అసిస్టెంట్ కార్య నిర్వహణాధికారి ఈరంకి. జగన్నాథ రావును ఇన్ చార్జి ఈవోగా నియమించారు.అయితే ఇక్కడ ఈవో పదోన్నతిపై వెళ్ళిన దగ్గర నుండి ఇన్ చార్జి పరిపాలన కొనసాగు తుంది. ఎట్టకేలకు సత్యదేవుని ఆలయ కార్యనిర్వాహణాధికారిగా జిల్లా రెవెన్యూ ఆఫీసర్ యమ్.జితేంద్రను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఈయన త్వరలో దేవస్థానం ఈవోగా పూర్తి భాద్యతలు స్వీకరిస్తారు.


## శీల పంచాయతీ కార్యాలయాన్ని పునర్నిర్మించాలి

కాజులూరు : మండలంలోగల శీల గ్రామ పంచాయతీ శిథిలావస్థకు చేరింది అని మాజీ సర్పంచ్ దాస్యం బీమామ్, శుక్రవారం గ్రామంలో విలేఖరులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం సుమారు 30 ఏళు క్రితం నిర్మించిన ఈ భవనం స్లాబ్ పైభాగం పెచ్చులూడిపడుతూ, గోడలు పగుళ్లు తీయడంతో ఏ క్షణాన కూలిపోతుందోనని సిబ్బంది స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకుని గ్రామంలో నూతన భవనము నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆద్వర్యంలో సునామి మాక్ డ్రిల్

భీమునిపట్నం : భీమిలి మండలం చేపలుప్పడ పంచాయతీ సుక్కవనిపాలెంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సునామి వచ్చినప్పుడు సాగరతీరంలో నివసించు ప్రజలు ఎలా అప్రమత్తం కావాలనే అంశంపై అన్ని ప్రభుత్వం శాఖలు పోలిస్, ఫైర్, రెవెన్యూ, వాటర్ విభాగం, మెడికల్, పంచాయతీ రాజ్ మొదలు శాఖలు మరియు 11 దేశాల ప్రతినిధులు ఈ సునామి మాక్ డ్రిల్ పాల్గొన్నారు

## ఘనంగా బాబా 92 వ జయంతి వేడుకలు



రావులపాలెం: స్థానిక శ్రీ సత్యసాయి అష్టదళ సేవా పుష్పం (సేవాకేంద్రం)లో మహావతార్ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 92 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామికి నగర సంకీర్తన అనంతరం పతాకావిష్కరణ, ఏకాదశి రుద్రాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్కి గ్రామంలో రధోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ముందుగా భజన మందిరంలో కేక్ కట్ చేసి బాబా వార్కి ఉయ్యాలోత్సవం నిర్వహించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మన్యం పర్వత వర్ధనరావు, కొవ్వూరి వివేకానందరెడ్డి, సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

యానాం : మహిళలు అన్ని రంగాల్లో రాణించి అందరికీ ఆదర్శంగా నిలవాలని ఇన్‌చార్జి పరిపాలనాధికారి ఎంవిఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక మినిసివిల్ స్టేషన్ సమావేశపు హాలులో సోషల్‌వెల్ఫేర్ శాఖ నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళలకు అనేక హక్కులు కల్పిస్తూ రక్షణ చర్యలు, అనేక స్కీమ్‌లలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వాటిని మహిళలు సద్వినియోగంచేసుకొని ఎదగాలన్నారు. ప్రపంచంలో అనేక దేశాలలో మహిళలు ఉన్నత పదవులను అధిరోహిస్తున్నారని వారి జీవిత గాథలను ఆదర్శంగా తీసుకొని రాణించాలన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో ఒక రజక కుటుంబంలోని ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఐఎఎస్‌కు ఎంపికవ్వడం మహిళలకు గర్వకారణంగా నిలిస్తుందన్నారు. పట్టుదలుంటే సాధ్యంకానిది లేదన్నారు. దీనిని ప్రతి మహిళా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ సందర్భంగా వివిధ క్రీడాపోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానంచేశారు. ఈ సందర్భంగా అన్నదన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజిని, సోషల్‌వెల్ఫేర్ అధికారి చింతా రామజోగి, అంగన్‌వాడి టీచర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# 1.50 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం

## మేనేజింగ్ డైరెక్టర్ వి.ఎస్ .నాయుడు



పాయకరావుపేట: 2017-18 సంవత్సరానికిగాను లక్షా యాభై వేల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తాండవ చక్కెర కర్మాగారం సంచాలకులు వి.ఎస్. నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతేడాది లక్ష టన్నులు మాత్రమే క్రషింగ్ చేయగలిగామన్నారు. ఈ ఏడాది అదనంగా మరో యాభై వేల టన్నులు క్రషింగ్ జరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. తమ కర్మాగారం పరిధిలో 1.30 లక్షల టన్నుల చెరకు రావటానికి అవకాశం వుందన్నారు. మిగిలిన 20వేల టన్నుల చెరకును తుమ్మపాల చక్కెర కర్మాగారం పరిదిలోని రైతుల నుంచి సేకరించాలని భావిస్తున్నామన్నారు. క్రషింగ్ సందర్భంగా కార్మికులు, రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కర్మాగారం పరిధిలోగల రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా తాండవ చక్కెర కార్మాగారం చైర్మన్ సుర్ల లోవరాజు చేతుల మీదుగా క్రషింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు గిట్టుబాటు ధర కల్పించటానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్థికమంత్రి యనమల రామకృష్ణ తాండవ కర్మాగారం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు నందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తుని మాజీ శాసనసభ్యులు రాజా అశోక్ బాబు, విశాఖజిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ , తుని మార్కెట్ కమిటి చైర్మన్ యనమల కృష్ణుడు, తుని మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, పాయకరావు పేట సర్పంచ్ ధనిశెట్టి నాగమణి తదితరులతో పాటు పలువురు కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి డిజిటల్ తరగతి ప్రారంభం

భీమునిపట్నం : భీమునిపట్నం కస్తూరిబా గాంధీ బాలికల విధ్యలయానికి డిజిటల్ తరగతి గది క్లాసు రూముని భీమిలి ఎం.పి.డి.ఓ కె.హరి ప్రసాదరావు ప్రారంభించారు. దీనికి చిప్పాడ దీవిస్ లాబరేటరీ యాజమాన్యం రూ1.30 లక్షలు అందించింది. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతూ కే.జి.భి.వి. విద్యార్థినులు ఇక పై దృశ్య శ్రవణ విద్యాభోధన ద్వారా మరింత విజ్ఞానము పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. విద్యాలయ ప్రత్యక అధికారి కె.గ్రేస్ లిల్లి మాటలాడుతూ చదవు మధ్యలో ఆపేసిన నిరుపేద విద్యార్థినుల అభివృద్ధికి దీవిస్ వారు అందించిన డిజిటల్ క్లాసు రూము ఎంతో ఉపయోగం మని వారికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దీవిస్ ఆఫీసర్ ఈ.నాగరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు .

# 26న ప్రత్తిపాడులో మెగా వైద్య శిబిరం




ప్రత్తిపాడు : తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడులో ఇంటింటికి వైద్యం అందరికీ ఆరోగ్యము అన్న నినాధంతో డిసిసి చైర్మెన్ వరుపుల.రాజా ప్రత్తిపాడు శాసన సభ్యులు వరుపుల .సుబ్బారావుల నేతృత్వంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపస్ 26 వ తేదీన వరుపుల.రాజా ఇంటి ఆవరణలో మహిళా డాక్టర్లు, చిన్నపిల్లల వైద్య నిపుణులు వస్తున్నా సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలో ఉన్న గ్రామీణ వైద్యులచే సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పియంపి అసోసియేషన్ అధ్యక్షుడు అందె.చిట్టికొండ,బియంపి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదిలం.బెన్నబాబు, సత్యానందం, రామకృష్ణ, సత్తి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వాలో యాంటీ బయోటెక్స్ వినియోగంతో దుష్పరిణామాలు

పాయకరావుపేట : ఆక్వా పరిశ్రమ లో నిషేధిత బయోటెక్ ఔషధాలను వినియోగించటం వలన తీవ్ర దుష్పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని మత్స్యశాఖ విశాఖజిల్లా సంయుక్త సంచాలకులు విమల కుమారి అన్నారు. మండలంలోని పాల్మన్ పేట సమీపంలోని వైశాఖి ఆక్వా పరిశ్రమలో మత్స్య సంపదలో బయోటెక్ వినియోగం వలన కలిగే పరిణామాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ ఆక్వాలో మనదేశ ఎగుమతులు రూ.37వేల కోట్ల రూపాయలుండగా, ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే 70శాతం ఎగుమతులు విదేశాలకు జరుగుతున్నాయన్నారు. అయితే ఈ పరిశ్రమలో వినియోగించే 30 రకాల బయోటెక్ ఔషధాలను ప్రభుత్వం నిషేదించిందన్నారు. వీటి కారణంగా వాతావరణ కాలుష్యంతో పాటు చేపలు, రొయ్యలను ఆహారంగా వినియోగిస్తున్న ప్రజలు అనేక రోగాలబారిన పడుతున్నారన్నారు. ఇటీవల కాలంగా విదేశాలకు ఎగుమతి అవుతున్న మన ఆక్వా కంటైనర్లను వివిధ దేశాలు నిషేదిస్తున్నాయన్నారు. దీంతో ఈ పరిశ్రమపై ఆధారపడిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ఆక్వా రైతులు సాంప్రదాయ పద్దతులను వినియోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందటానికి తమ సూచనలు పాటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో పిషరీష్ ఎప్ డీవోలు శ్రీదేవి, సీతా రామరాజు, వైశాఖి హేచరీ జనరల్ మేనేజర్ జానకిరాంతో పలువురు ఆక్వారైతులు పాల్గొన్నారు.

# చిత్రభాను



## బాలకృష్ణుడు రివ్యూ




నారా రోహిత్ సినిమా అంటే సరికొత్త కథ, విభిన్నమైన కాన్సెప్ట్ ఇవే ప్రేక్షకులకు తెలిసింది. ఆయన కథల ఎంపిక కూడా అందుకు తగ్గట్టుగానే ఉంటుంది. తొలి చిత్రం 'బాణం'తోనే అది నిరూపితమైంది. అంతేకాదు, వేగంగా సినిమాలు చేసే అతికొద్ది మంది యువ కథానాయకుల్లో నారా రోహిత్ ఒకరు. అయితే వీటన్నింటినీ పక్కన పెట్టి ఆయన చేసిన కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'బాలక ృషు?డు'. పవన్ మల్లెల దర్శకుడిగా పరిచయం అయ్యారు. మరి దర్శకుడు పవన్ తొలి ప్రయత్నం ఎలా ఉంది? 'బాలక ృషు?డు'గా నారా రోహిత్ చేసిన తొలి కమర్షియల్ మూవీ ఆకట్టుకుందా?

కథేంటంటే: రాయలసీమకు చెందిన భానుమతిదేవి(రమ్యక ృష?), ప్రతాప్‌రెడ్డి (అజయ్) మధ్య వివాదం నడుస్తుంటుంది. భానుమతిదేవి మేనకోడలు ఆద్య(రెజీనా)ని చంపి కక్ష తీర్చుకోవాలనుకుంటాడు ప్రతాప్‌రెడ్డి. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన భానుమతి.. ఆద్యకు తెలియకుండానే ఆమెకు రక్షణగా బాలు(నారా రోహిత్) అనే అంగరక్షకుడిని నియమిస్తుంది. అయినా, జైలు నుంచి తప్పించుకుని ఆద్యను అంతం చేయడానికి పూనుకుంటాడు ప్రతాప్. ఫాక్షనిస్ట్ అయిన అతని నుంచి ఆద్యను బాలు రక్షించాడా? లేదా? వారిద్దరి మధ్య ప్రేమ చిగురించాక ఏం జరిగింది? అన్నదే 'బాలక ృషు?డు'.

ఎలా ఉందంటే..?: ఇది రొటీన్ కథే. కథలో కానీ, కథనంలో కానీ ఎక్కడా వైవిధ్యం కన్పించదు. కానీ, వాణిజ్యాంశాలను మేళవించడంలో దర్శకుడు తన ప్రతిభను కనబరిచాడు. ముఖ్యంగా హాస్యం విషయంలో మంచి కసరత్తులు చేశాడు. దాంతో చాలా సన్నివేశాలు బాగా నవ్విస్తాయి. సినిమా ఆరంభం, నాయకానాయికల పరిచయం, కమర్షియల్ సినిమాలకు అనుగుణంగానే ఉంటాయి. దాంతో ఆ సన్నివేశాలు సాదాసీదాగా అనిపిస్తాయి. కథలోకి ఎప్పుడ్కెతే ప ృథ్వీ(30 ఇయర్స్ ప ృథ్వీ) ప్రవేశిస్తాడో అప్పటి నుంచి వినోదం పండుతుంది. నారా రోహిత్, ప ృథ్వీల మధ్య వచ్చే సన్నివేశాలు మంచి టైమింగ్‌తో సాగుతూ కితకితలు పెడతాయి. కథ రకరకాల మలుపులు తిరిగినప్పటికీ ప్రతి సన్నివేశం ప్రేక్షకుడి వూహకు తగ్గట్టుగానే సాగుతుంది. ద్వితీయార్ధంలో శ్రీనివాస్‌రెడ్డి బ ృందం చేసే నాటకం ఎపిసోడ్ ప్రేక్షకులని నవ్వించకపోగా కాస్త సాగదీతగా అనిపిస్తుంది. అక్కడ కూడా ప ృథ్వీ, నారా రోహిత్ మధ్య సన్నివేశాలు కీలకంగా మారాయి. నాయకానాయికల మధ్య ప్రేమ చిగురించే సన్నివేశంలో, రెజీనా కుటుంబం నేపథ్యంలో సాగే సన్నివేశాల్లో సెంటిమెంట్ పాళ్లు తగ్గాయి. పతాక సన్నివేశాలను మరింత బలంగా చూపించి ఉంటే బాగుండేది.

ఎవరెలా చేశారంటే?: నారారోహిత్ ఈ సినిమా కోసం స్లిమ్‌గా మారారు. ఆయన ఫక్తు కమర్షియల్ సినిమాల్లో నటించడం ఇదే తొలిసారి కాబట్టి ఆయనకు ఈ సినిమా కొత్తగా అనిపిస్తుంది. తెరపై కూడా కొత్తగా కనిపించారు. రెజీనా అందంతో ఆకట్టుకుంది. తన ఆహార్యంతో కుర్రకారును ఆకట్టుకునే ప్రయత్నం గట్టిగానే చేసింది. భానుమతి దేవిగా రమ్యక ృష? పాత్ర పరిధి మేరకు చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు. అజయ్ చాలా సినిమాల్లో చేసిన పాత్రనే ఇందులోనూ చేశాడు. ప ృథ్వీ నటన, ఆయన పంచిన వినోదం సినిమాకు ప్రధాన బలం. మిగిలిన పాత్రలు ఫర్వాలేదనిపిస్తాయి.

సాంకేతికంగా.. సినిమాకి మంచి మార్కులు పడతాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి. దర్శకుడు పవన్ మల్లెల కథ, కథనం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేది. హాస్యంతో కూడిన సన్నివేశాలపై మాత్రం తన పట్టుని ప్రదర్శించాడు. విజయ్ సి.కుమార్ కెమెరా, మణిశర్మ సంగీతం, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ చక్కగా కుదిరాయి. మిగిలిన విభాగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.



## మభ్యపెట్టింది మీరు కాదా?


### చంద్రబాబుపై బొత్స సత్యనారాయణ ధ్వజం



విశాఖపట్నం: చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతం వల్లే రాష్ట్రం విడిపోయిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర విభజనను సమర్థించిన చంద్రబాబు ఇప్పుడు ఈ అంశాన్ని తన స్వార్థప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి కలిసి రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. ఆనాడు కాంగ్రెస్‌తో చంద్రబాబు కుమ్మక్కు కావడం వాస్తవం కాదా అని సూటిగా ప్రశ్నించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి తమ్ముడు టీడీపీలో చేరిక సందర్భంగా నిన్న చంద్రబాబు చేసిన ఆరోప ణలను బొత్స సత్యనారాయణ ఖండించారు. విభజన జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంతగానో పోరాడాడని చంద్రబాబు పొగడటం ఆయన నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చి వైఎస్సార్ సీపీపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సంజీవని లాంటి ప్రత్యేకహోదాను తన స్వార్థం కోసం చంద్రబాబు తాకట్టు పెట్టారని ఆరోపించారు. చంద్రబాబులా టక్కు టమారా విద్యలు తమకు తెలియవని బొత్స సత్యనారాయణ వ్యంగ్యంగా అన్నారు.

## గీతంలో సిఎస్ఐ విద్యార్ధి విభాగం

### రాష్ట్ర సమావేశాలు ప్రారంభం



సాగర్‌నగర్ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) గీతం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 17న రాష్ట్ర స్థాయి సమావేశాల ప్రారంభమయ్యాయి.

రాష్ట్రం లోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి దాదాపు రెండు వేల మందికిపైగా విద్యార్థి ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరైయ్యారు . ఎంబ్రేసింగ్ డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్ పేరిట ఈ సమావేశాలను నిర్వహించామని సమావేశాలలో భాగంగా నిపుణుల పర్యవేక్షణలో సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ అనే అంశాలపై వర్కషాప్‌లు, అలాగే కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంపై క్విజ్ పోటీలను, సాంకేతి చర్చలను నిర్వహించారు. ఈ సమావేశాలను కంట్రోల్ ఎస్ సంస్థ డైరక్టర్ ఆర్.ఎస్. ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడూతూ యువతకు ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు పెరుగుతున్న నేపద్యంలో కళాశాల స్థాయి నుంచి నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ జీవతంలో లక్ష్యాలను చేరడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. బిగ్‌డేటా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, త్రీడి ప్రింటింగ్ లో వస్తున్న సాంకేతిక ప్రగతిని వివరించారు. వాణిజ్య, ఆర్థిక, న్యాయ రంగాలతో పాటు వైద్య రంగంలో సైతం మెషిన్ లెర్నింగ్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు లభించాలంటే నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాజెక్టు నివేదికల సమయంలో చురుకుగా వ్యవహరించటం, ఆన్‌లైన్‌లో సర్టిఫికేట్ కోర్సులను పూర్తి చేయడం, కోడింగ్ పై జరిగే వివిధ పోటీలను పాల్గొనటం ద్వారా అవకాశాలు పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. సిఎస్ఐ రాష్ట్ర విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి.ఇ.ఎస్.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెదమాకవరంలో ఆగిన ఉపాధి చెల్లింపులు

కొయ్యూరు : మండలంలోని పెదమాకవరంలో నాలుగు నెలలుగా ఉపాధి బిల్లులు చెల్లింపులు జరగడం లేదు. గ్రామంలోని తపాలా శాఖలోని మినీ ఏటిఎం పాడవడంతో అధికారులు దానిని సాకుగా చూపి చెల్లింపులు చేయడం లేదు. తపాలా శాఖలో ఉపాధి నిదులు చెల్లింపుల తీరుపై ఐటిడిఎ పిఒ రవిపట్టాన్‌శెట్టి కొద్ది రోజుల కిందట అసంతృప్తి చెందారు. అయినా అధికారులు దృష్టిసారించడం లేదు. సకాలంలో చెల్లింపులు సాగడం లేదు. నెల కిందట ఉపాధి సొమ్ము విడుదల అవగా అన్ని చోట్ల చెల్లింపులు చేస్తున్నారు. కానీ పెదమాకవరంలో మాత్రం కావడం లేదు. మినీ ఏటిఎం పాడవడమే కారణం అధికారులు చెబుతున్నా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. కాగా యంత్రాన్ని బాగా చేయడం కోసం పది రోజుల కిందట ఎంసి రాజుకు ఇచ్చాం. ఆయన దానిని బాగు చేసి ఇవ్వాల్సి ఉంది. పది రోజులు దాటినా ఇవ్వడం లేదు. దీనిపై ఆయనకు ఫోన్ చేస్తుంటే స్పందించడం లేదని కేడీపేట తపాలాశాఖ బిఎం చెప్పారు.

## వైభవంగా కనకదుర్గ అమ్మవారి ఆలయ శంకుస్థాపన

నాతవరం : నాతవరంలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తాండవ కాలువ గట్టు వద్ద వేద పండితుల నడుమ ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశ్రీశ్రీ కనక దుర్గాంబిక ఆలయం నాతవరం పరిసర ప్రాంతాలలో ఎక్కడా లేని ఒక విశిష్ట రీతిలో అమ్మవారి 9 రూపాలతో విగ్రహం, ద్వజస్తంభం, తాండవ కాలువలో శివుని విగ్రహం, శివలింగంతో సుమారు రూ.80లక్షల అంచనాలతో ఈ నిర్మించనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంకు మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప దంపతులు, నాతవరం ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నాతవరం ఎంపిటిసి అపిరెడ్డి మాణిక్యం, గ్రామస్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవల్లీ దేవత సేన సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం

రావికమతం : కొత్తకోట బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీవల్లీ దేవత సేన సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రాజన్న పౌండేషన్ చైర్మన్ పివిఎస్ఎన్.రాజు దంపతులు ఈ కళ్యాణాన్ని జరిపించారు. స్వామి వారిని డిసిసిబి డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, పలువురు పెద్దలు దర్శించుకున్నారు. ఈ వేడుకలకు అత్యంత సంఖ్యలో భక్తులు పాల్గని కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## 26న కీస్తురాజు పండుగ

రోలుగుంట : రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న చర్చిలో ఈ నెల 26వ తేదీన కీస్తురాజు పండుగ జరగనున్నట్లు పాదర్ విజయ్‌బాస్కర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చర్చి వారోత్సవం సందర్భంగా ఏటా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ ఆదివారం కీస్తు రాజు పండుగ చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు గ్రామంలో పుర ప్రదర్శన, ప్రత్యేక ప్రార్ధనలు జరుగుతాయన్నారు.

## భక్తమార్కండేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



నర్సీపట్నం : శుక్రవారం నర్సీపట్నం మున్సిపాలిటీలోని 22వ వార్డులోనినర్సీపట్నం పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తమార్కండేయ ఆలయ నిర్మాణానికి నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్శన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు దంపతులు శంకుస్థాపన చేశారు.

ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు (జమీలు) మాట్లాడుతూ నర్సీపట్నంలో ఈ ఆలయం నిర్మించడం మంచి పరిణామమన్నారు. పద్మశాలి సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో గొల్లప్రొలు మున్సిపల్ చైర్ పర్శన్ శీరం మాణిక్యం, భీమిలి మాజీ మున్సిపల్ చైర్ పర్శన్ ప్రభావతి, , ఎంపిపి సుకల రమణమ్మ, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, 22వ వార్డు కౌన్సిలర్లు సుగుణ, పద్మశాలీ సంక్షేమ సంఘం వారు పాల్గొన్నారు.

## గీతం దంతవైద్యులకు జాతీయస్థాయి అవార్డు



సాగర్‌నగర్ : గీతం దంత వైద్యకళాశాల అసుపత్రికి చెందిన వైద్య అద్యాపకులు, పూర్వ విద్యార్థులు ఆర్థోడాం టిక్స్ విభాగంలో జరిపిన పరిశోధనలకు గాను అయిదు జాతీయ స్థాయి అవార్డులను అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.గంగాధర ప్రసాద్ తెలిపారు. ఎత్తుపళ్ళు, వంకర పళ్ళు సరిచేసే ఆర్థో డాంటిక్స్‌లలో నూతన వైద్య అవసరాలను సూచించినందుకు గాను ఇండియన్ ఆర్థోడాంటిక్స్ సొసైటీ ఇటీవల జైపూర్‌లో నిర్వహించిన సమావేశాలలో జాతీయ అవార్డులను అందజేసిందని, ఒకే విద్యాసంస్థకు ఇన్ని అవార్డులు రావడం విశేషమన్నారు. అవార్డులు అందుకున్న డాక్టర్ ఆర్.ప్రీతమ్, డాక్టర్ ఏక వేణిక, డాక్టర్ నాగ్ పర్వేజ్ షేక్, డాక్టర్ యజ్ఞేష్ మంతీ లను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అభినందించారు.

## గీతం విద్యార్థికి ఎన్‌సిసి ఉత్తమకేడెట్ అవార్డు

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి యువరాజ్ సింగ్ ఎన్‌సిసి ఉత్తమ కేడెట్‌గా ఎంపికయ్యారు.ఉభయి తెలుగు రాష్ట్రాలలోను ఎన్‌సిసి కేడెట్‌లు కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గీతం విద్యార్థి యువరాజ్ సింగ్‌ను ఎన్‌సిసి డిప్యూటి డైరక్టర్ జనరల్ కమండేషన్ కార్డుకు ఎంపిక చేశారు.గురువారం 17 న సికింద్రాబాద్‌లోని ఎన్‌సిసి డిప్యూటీ డైరక్టర్ జనరల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యువరాజ్ సింగ్ ఈ అవార్డు ను స్వీకరించారు. కాగా ఎన్‌సిసి లో యువరాజ్ సింగ్‌కు అవార్డు లభించడం పట్ల గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు,ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ఎమ్.పోతరాజు,గీతం ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ బి.శ్రీనివాస్ అభినందించారు.

# ఘనంగా అంజని, వినయ్ నిశ్చితార్థ వేడుక









విశాఖ సిటీ : ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకుడు, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ చొక్కాకుల వెంకటరావు కుమార్తె చి.ల.సౌ. అంజని నిశ్చితార్థవేడుక శుక్రవారం హొటల్ నోవోటెల్‌లో ఘనంగా జరిగింది. నగరానికి చెందిన ఆదిరెడ్డి వెంకట రమణ కుమారుడు వినయ్‌తో పెద్దల సమక్షంలో అంజని నిశ్చితార్థ వేడుక అంగరంగవైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ వేడుకకు రాష్ట్రం నలుమూలల నుండి పార్టీలకతీతంగా పలువురు రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలు, పెద్దలు హాజరై అంజని, వినయ్‌లను ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, అనకాపల్లి లోక్‌సభసభ్యుడు అవంతి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ, బిజెపి మాజీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ పివి చలపతిరావు, మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, దాడి వీరభద్రరావు, పసుపులేటి బాలరాజు, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, పీలా గోవింద సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, గిడ్డి ఈశ్వరి, కిడారి సర్వేశ్వరరావు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, వంగలపూడి అనిత, వైకాపా నగర అధ్యక్షుడు మళ్లా విజయప్రసాద్, రూరల్ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, తూర్పు సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర సమన్వయకర్తలు సనపల చంద్రమౌళి, పసుపులేటి ఉషాకిరణ్, నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, కొయ్య ప్రసాదరెడ్డి, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాల పాప,టిడిపి నాయకుడు లాలం భాస్కర్, విశాఖ నగర ట్రాఫిక్ ఏసీపీ కింజరాపు ప్రభాకర్, వేపగుంట మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి చెల్లయ్యమ్మ, విజయభాను సంస్థల అధినేత బి. చంద్రశేఖర్ దంపతులు, లీడర్ సంపాదకుడు వి.వి. రమణ మూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త, సంఘసేవకుడు బోకం శ్రీను, బగాది విజయ్, సూరిశెట్టి లక్ష్మణ్, టిడిపి పట్టాభి, గుంటూరు భారతి మరియు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు పరుగులకే ఆలౌట్..

గుంటూరు: క్రికెట్ చరిత్రలో మరో సంచలనం నమోదైంది. నాగాలాండ్ మహిళల అండర్-19 క్రికెట్ జట్టు కేవలం రెండు పరుగులకే ఆలౌట్ అయ్యింది. కేరళతో జరిగిన మ్యాచ్‌లో 17 ఓవర్లు ఆడినప్పటికీ.. నాగాలాండ్ టీం 2 పరుగులు మాత్రమే చేయగలిగింది. బీసీసీఐ నిర్వహించిన మహిళల అండర్-19 వన్డే లీగ్‌లో ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గుంటూరులోని జేకేసీ కాలేజీ గ్రౌండ్ ఇందుకు వేదికైంది. మరో విశేషం ఏంటంటే.. ఓపెనర్ మేనక మాత్రమే 18 బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేయగలిగింది. మరో పరుగు వైడ్ రూపంలో వచ్చింది. 9 మంది బ్యాటర్లు డకౌట్‌గా వెనుదిరిగారు. ఈ మ్యాచ్‌లో పరుగులిచ్చిన ఏకైక కేరళ బౌలర్ అలీనా సుందరన్ మాత్రమే. ఆమె మూడు ఓవర్లు వేయగా, అందులో రెండు మెయిడిన్లు అయ్యాయి. ఒక వైడ్, మరో పరుగు ఇచ్చుకుంది. మరో కేరళ బౌలర్ సౌరభ్య.పి ఆరు మెయిడిన్ ఓవర్లు వేసి రెండు వికెట్లు పడగొట్టింది. మిన్నూ మణి నాలుగు ఓవర్లు వేసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా నాలుగు వికెట్లు తీసింది. సంద్ర సురేన్, బిబీ సెబాస్టియన్ తలో వికెట్ తీశారు. మూడు పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన కేరళ జట్టు ఒక్క బంతికే విజయం సాధించింది. నాగాలాండ్ బౌలర్ దీపికా కైన్‌తురా వైడ్‌తో మ్యాచ్‌ను ప్రారంభించింది. తర్వాతి బంతిని అన్సు ఎస్ రాజ్ బౌండరీకి తరలించడంతో కేరళ గెలుపొందింది.

## వచ్చే ఏడాది అందుబాటులోకి భూ సేవ



అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి భూ సేవ పూర్తిగా అందుబాటులోకి రానుంది. 2018 మార్చికల్లా దీనికి సంబంధించి 20 సేవలు అనుసంధానం పూర్తిచేయనున్నారు. ఇప్పటికే 8 సేవల అనుసంధానం పూర్తయిందని ముఖ్య మంత్రికి అధికారులు వివరించారు. మున్సి పాలిటీల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూసేవ వచ్చే నెలాఖరుకల్లా పూర్తవుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా దీన్ని అమల్లోకి తెస్తామని తెలిపారు. అమరావతి సచివాలయం లోని తన కార్యాలయంలో వివిధ శాఖల్లో ఐటీ, ఐవోటీ, ఈ-ప్రగతి అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ-ప్రగతి ద్వారా ప్రతి శాఖను అనుసంధానించి ప్రజలకు రియల్ టైమ్‌లో సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. రోజూ ఉదయాన్నే రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై గంటసేపు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూ సేవ గురించిన సమాచారాన్ని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. భూసేవలో భాగంగా ప్రతి వ్యక్తి ఆధార్ నంబర్ కేటాయించినట్లుగా యునిక్ ఐడీ నంబర్ కేటాయిస్తామని తెలిపారు. దీనికోసం కొత్తగా ఎలాంటి సర్వే చేపట్టకుండా అందుబాటులో ఉన్న డిజిటలైజ్ ఫీల్డ్ మ్యాప్‌బుక్ (ఎఫ్ఎంబీ) వంటి సమాచారంతో దీన్ని రూప కల్పన చేయనున్నట్లు చెప్పారు. భూ విస్తీర్ణం, పుర సేవ, వెబ్‌ల్యాండ్‌లో భూసేవలో పొందుపరుస్తారు. దీన్ని విజయ వంతం చేసేందుకు సర్వేయర్లు, వీఆర్వోలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామ ని, రియల్‌టైమ్ మానిటరింగ్ కోసం భూ సేవ డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేసి దాన్ని కోర్ డ్యాష్‌బోర్డుకు అనుసంధానిస్తామని ముఖ్యమంత్రికి వివరించారు.

### హాంగ్‌కాంగ్ ఓపెన్లో
## సెమీఫైనల్‌కు సింధు



హాంకాంగ్ : భారత స్టార్ షట్లర్ పీవీ సింధు హాంగ్ కాంగ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన అకానే యమగుచిపై 21-12, 21-19 తేడాతో సింధు వరుస గేముల్లో విజయం సాధించింది. ఆరంభం నుంచే ధాటిగా ఆడిన తెలుగు తేజం 37 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసింది. వీరిద్దరూ ఆరుసార్లు తలపడగా.. సింధుకు ఇది నాలుగో విజయం కావడం విశేషం. అంతకు ముందు జపాన్‌కు చెందిన లయా ఒహోరీపై వరుస గేముల్లో నెగ్గిన సింధు.. క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. 21-14, 21-17 తేడాతో ఒహోరీని మట్టి కరిపించిన సింధు.. ఇప్పటి వరకూ జపాన్ ప్లేయర్ చేతిలో ఒక్కసారి కూడా ఓడిపోలేదు. మరో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. చైనాకు చెందిన ఎనిమిదో సీడ్ ప్లేయర్ చెన్ యుఫెయి చేతిలో 21-18, 19-21, 10-21 తేడాతో ఓటమిపాలైంది. తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న సైనా.. తర్వాతి రెండు గేముల్లో ఓడటంతో.. టోర్నీ నుంచి వైదొలగాల్సి వచ్చింది.

పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ జపాన్‌కు చెందిన కజుమస సకాయి చేతిలో ఓడిపోయాడు. 54 నిమిషాలపాటు పోరాడిన ప్రణయ్ 21-11, 10-21, 15-21 తేడాతో పరాజయం పొందాడు. పారుపల్లి కశ్యప్, సౌరభ్ వర్మ తొలి రౌండ్లోనే టోర్నీ నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

## తొలి రోజు టీమిండియాదే..

### భారత్ తొలి ఇన్నింగ్స్: 11/1 - శ్రీలంక 205 ఆలౌట్



నాగ్‌పూర్: భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టులో ఇరు జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగుతోంది. పిచ్‌పై బౌలర్లు చెలరేగుతుండటంతో బ్యాట్స్‌మెన్ తడబడుతున్నారు. శ్రీలంకను తొలి ఇన్నింగ్స్‌లో 205 పరుగులకు ఆలౌట్ చేసి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. తొలి రోజు ఆట ముగిసేసరికి టీమిండియా 8 ఓవర్లలో వికెట్ నష్టానికి 11 పరుగులు చేసింది. ఈడెన్ టెస్టులో విఫలమైన ఓపెనర్ కేఎల్ రాహుల్(7) రెండో టెస్టులోనూ నిరాశపరిచాడు. ప్రస్తుతం మురళీ విజయ్(2), చతేశ్వర్ పుజారా(2) క్రీజులో ఉన్నారు. శ్రీలంక ఆటగాళ్లు కరుణరత్నె(51: 147 బంతుల్లో 6x4), దినేశ్ చండీమాల్(57: 122 బంతుల్లో 4x4, 1x6) రాణించడంతో శ్రీలంక జట్టు 79.1 ఓవర్లలో 205 పరుగులు చేసింది.

అంతకుముందు టాస్ గెలిచి ఇన్నింగ్స్ ఆరంభించిన లంకకు శుభారంభం లభించలేదు. రెండో టెస్టులో జట్టులోకి వచ్చిన ఇషాంత్.. ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో లంక ఓపెనర్ సమరవిక్రమ(13)ను ఆరంభంలోనే పెవిలియన్ పంపి వికెట్ల ఖాతా తెరిచాడు. పేసర్లు ఇషాంత్, ఉమేశ్ యాదవ్‌ల పదునైన బంతులను ధాటిగా ఎదుర్కొంటూ మరో వికెట్ పడకుండా లంక బ్యాట్స్‌మెన్ జాగ్రత్తపడ్డారు. ఓపెనర్ కరుణరత్నె సంయమనం కోల్పోకుండా అడ్డుగోడలా నిలబడినప్పటికీ మరోవైపు భారత బౌలర్లు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వీలుచిక్కినప్పుడల్లా వికెట్లు తీస్తూ వచ్చారు. నాగ్‌పూర్ పిచ్ పేస్‌కు అనుకూలిస్తున్నప్పటికీ టీమిండియా స్పిన్నర్లు అదరగొట్టారు. 25వ ఓవర్‌లో తిరుమానె(9)ను అశ్విన్ ఔట్ చేసి లంక పతనానికి తెరలేపాడు. తర్వాత స్వల్ప వ్యవధిలోనే లంక సీనియర్ ఆటగాడు మాథ్యూస్‌ను జడేజా ఎల్బీగా పెవిలియన్ పంపడంతో లంక పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. వికెట్లు పడుతున్నప్పటికీ మరో ఎండ్‌లో పోరాడుతున్న కరుణరత్నె అర్ధశతకం పూర్తి చేసుకున్న కొద్దిసేపటికే వెనుదిరిగాడు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com